



కాకినాడ జిల్లా క్రీడామైదానం వద్ద ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ కోసం సాఫీగా మారిన రోడ్డు, పక్కన బారికేడ్లు

నేటి నుంచి ఆర్మీ ర్యాలీ

12 జిల్లాల నుంచి 15 వేల మంది కాకినాడ రాక

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి 20వ తేదీ వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు 12 జిల్లాల నుంచి అభ్యర్థులు ఈ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొననున్నారు. ఇప్పటికే ఆర్మీ ఎంపిక పరీక్ష రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఇక్కడ దేహదారుఢ్య పరీక్ష, 1.6 కి.మీ రన్, మెడికల్ అండ్ ఫిట్‌నెస్ టెస్టులు, లాంగ్ జంప్, పుల్ అప్స్, నైన్ ఫీట్ డిచ్ అండ్ జిగ్‌జాగ్ ఇలా ఎంపిక ప్రక్రియకు సంబంధించిన అనేక రకాల ఈవెంట్లు జరగనున్నాయి. రోజుకు 600 నుంచి 800 మంది రిక్రూట్‌మెంట్‌లో పాల్గొంటారు. అభ్యర్థులకు ముందుగా నెంబర్లు కేటాయించి, వందమంది చొప్పున 1.6 కి.మీ రన్నింగ్ పరీక్ష, అనంతరం మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు.20 రోజులపాటు జరిగే రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో 15 వేల మంది పాల్గొనే అవకాశం ఉంది. ఆర్మీ అభ్యర్థులకు స్పోర్ట్స్ అథారిటీ ఆవరణలోనే వసతి కల్పించనున్నారు. తొలి రోజు 5వ తేదీ అంటే 4వ తేదీ సోమవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభయ్యే ర్యాలీలో తొలి రోజు 600 మంది పాల్గొననున్నారు. రెండో రోజు ఆరో తేదీ (ఐదో తేదీ అర్ధరాత్రి) మరో 671 మంది, 7,8,9 తేదీల్లో వరుసగా మూడు రోజుల్లో రోజుకు 800 మంది చొప్పున అభ్యర్థులు ర్యాలీలో పాల్గొంటారు. 10వ తేదీన విరామం. 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు రోజుకు 800 మంది పాల్గొంటారు. 15వ తేదీ స్వాతంత్ర్యం దినోత్సవం రోజున సెలవు ప్రకటించారు. 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ జరగనుంది. 20న రెస్ట్ డేతో మొత్తం ఎంపిక ప్రక్రియ పూర్తవుతుంది.

జిల్లాల వారీగా ర్యాలీ షెడ్యూల్ ఇలా..

ఆగస్టు 5వ తేదీ : అల్లూరిజిల్లా, అనకాపల్లి, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్	
ఆగస్టు 6, 7, 8 :	అనకాపల్లి
ఆగస్టు 7 :	యానాం
ఆగస్టు 8, 9 :	పార్వతీపురం
ఆగస్టు 9, 11 :	విశాఖపట్నం
ఆగస్టు 11, 12, 13, 14, 16 :	శ్రీకాకుళం
ఆగస్టు 16, 17, 18, 19 :	విజయనగరం
ఆగస్టు 19 :	కాకినాడ జిల్లా

7
తల్లీ..ఇద్దరు కుమార్తెల హత్య
సామర్లకోటలో దారుణం

నేటి నుంచి వాడపల్లిలో పవిత్రోత్సవాలు
మూడు రోజుల నిర్వహణ



సహ కారం!

సొసైటీ పదవుల్లో కూటమి నాయకులకు షాక్

- త్రీమెన్ కమిటీలకు ఝలక్
- సొసైటీల్లో పర్సన్ ఇన్‌చార్జిలు
- గత నెల 30న ముగిసిన గడువు
- మరో ఆరు నెలలు పొడిగింపు
- అయోమయంలో ఆశావహులు

ప్రభుత్వం ఏర్పడేందుకు మేం సహకరించాం.. ప్రభుత్వ సహకారం మాకు ఉంటుంది..అని పలువురు ఆశలు పెట్టుకున్నారు.. జూలై 30న పర్సన్ ఇన్‌చార్జిల పాలన ముగిసింది.. దీంతో త్రీమెన్ కమిటీల్లో ఛాన్స్ దక్కుతుందని ఆశించారు.. అయితే ప్రభుత్వం మాత్రం సొసైటీలపై ఆశలు పెట్టుకున్న నాయకులకు షాక్ ఇచ్చింది. మరో ఆరు నెలలు వారినే కొనసాగిస్తున్నట్టు ఉత్తర్వులు విడుదల చేయడంతో నేతలంతా గరం..గరంగా ఉన్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సొసైటీల్లో పెత్తనం కోసం ఎదురుచూస్తున్న నేతలకు ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. అధికార కూటమిలోని తెలుగుదేశం,జనసేన, బీజేపీ నేతలకు గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం సొసైటీ పాలకవర్గాల్లో ఆయా పార్టీ నేతలను నామినేట్ చేస్తున్న సంగతి తెలిసిందే. గత వైసీపీ పాలనలో వైసీపీ నేతలతో కమిటీలను నియమించింది.తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చాక వాటిని రద్దు చేసి..అఫీషియల్ కమిటీలను నియమించింది. ఇటీవల ఆయా సొసైటీలకు కూటమి నేతలను నామినేట్ చేసే ప్రక్రియ మొదలైంది. కొన్ని సొసైటీలకు ఇప్పటికే త్రీమెన్ కమిటీలను నియమించారు. కానీ ఇంకా పెండింగ్ ఉన్నాయి.

166 సొసైటీలకు ప్రతిపాదనలు

తూర్పుగోదావరి జిల్లాలో 83 సొసైటీలు, కాకి నాడలో 24, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 59 మొత్తం 166 సొసైటీలకు త్రీమెన్ కమిటీలను నియమించాల్సి ఉంది. మూడు జిల్లాల్లో పదవులకు తీవ్ర పోటీ ఉండడంతో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు చర్చించుకుని..అందరికీ నచ్చచెప్పి ఇటీవల ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలు కాస్త ముందుగా వెళ్లి ఉంటే అన్ని సొసైటీలకు త్రీమెన్ కమిటీలు ఈ పాటికే నియామకం పూర్తయ్యేది.ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల నుంచి వెళ్లిన ప్రతి పాదనలు పార్టీ అధిష్ఠానానికి చేరాయి. అక్కడ పెద్దలు కూర్చుని మళ్లీ చర్చించే అవకాశం ఉంది.ఈ సభ్యుల వివరాలు కోరుతూ ఆయా జిల్లాలో సహకార శాఖ అధికారులకు జాబి తాలు వస్తాయి.వాటిని పరిశీలించి..ఆయా సొసైటీల ద్వారా సొసైటీ సభ్యులుగా అర్హులేనా అనే సమాచారం సేకరిస్తారు.ఫైనాన్స్, ఎరువుల వ్యాపారం చేస్తున్నా, సొసైటీల్లో బకాయిలు ఉన్నా, సొసైటీలోని ఉద్యోగులకు ఎవరైనా బంధువులై ఉన్నా వారు అనర్హుల వుతారు. ఇటువంటి జాబితాలు ఇంకా సహకార శాఖ అధికారులకు చేరలేదు. కానీ ప్రస్తుతం ప్రతిపాదనల్లో ఉన్న కమిటీలను ఎప్పుడో నియమిస్తే అప్పటి నుంచి త్రీమెన్ కమిటీలు అధికారంలోకి వస్తాయి. వారు వచ్చే జనవరి 30వ తేదీ వరకూ అధికారంలో ఉంటారు. అప్పటి లోపు ఎన్నికలు జరిగితే కొత్త పాలకవర్గాలు వస్తాయి. ఎన్నికలు జరగకపోతే మరో ఆరు నెలల పాటు త్రీమెన్ కమిటీలే కొనసాగుతాయి. ప్రస్తుతం ప్రతిపాదనలన్నీ కొద్ది రోజులు ముందుగా వెళ్లి ఉంటే ఇవాళ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలను కొనసాగించే అవసరం లేకపోయేది. ఒక్కో సొసైటీకి ముగ్గురు వంతున నియామకం వల్ల వందలాది మంది పార్టీనేతలకు పదవులు వచ్చేవి.కానీ ప్రస్తుతం కొంత వెయిటింగ్ తప్పదు.

173 సొసైటీలకు పాతవారే..



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొద్ది రోజుల కిందట సుమారు 173 సొసైటీ లకు త్రీమెన్ కమి టీలను నియ మించారు. అం దులో ఒకరు చైర్ పర్సన్, ఇద్దరు డైరెక్టర్లు ఉం టారు. గతజూలై 30కి పాత పాలకవర్గాల గడువు ము గియడంతో మరో ఆరు నెలల పాటు పొడి గిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చింది.ఇప్పటికే త్రీ మెన్ కమిటీల నియామకమైన సొసైటీల్లో వారే కొనసాగుతారు.కమిటీలు లేని చోట పర్సన్ ఇన్ చార్జి కొనసాగుతారు.2013లో సొసైటీలకు ఎన్ని కలు జరిగాయి. తర్వాత వాటికి ఎన్నికలు నిర్వ హించలేదు. అప్పటి నుంచి కమిటీలను నియ మిస్తూ నెట్టుకొస్తున్నారు.



రెడీ ఎస్సీ!

15లోపు మెగా డీఎస్సీ ఫలితాలు

- ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ
- అభ్యర్థుల ఎదురుచూపులు
- ఉమ్మడి జిల్లా పోస్టులు 1241
- పరీక్షకు 38,617 మంది హాజరు
- ఒక్కో పోస్టుకు 50 మంది పోటీ
- 16 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన
- నెలాఖరుకు టీచర్లకు శిక్షణ
- కల నెరవేర్చిన కూటమి ప్రభుత్వం
- గత వైసీపీ ఐదేళ్లు మాటలే
- మరో హామీ నెరవేర్చినట్టే

లక్షలాది మంది నిరుద్యోగులకు టీచర్ ఉద్యోగం ఒక కల..గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వంలో ఊరించి ఉసూరుమనిపించి ఆ కలకు బ్రేకులు వేసింది..అయితే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే డీఎస్సీ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు.. అన్నట్టుగానే నోటిఫికేషన్ విడుదల చేశారు.. పరీక్షలు నిర్వహించారు.. మరో 13 రోజుల్లో ఫలితాలు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు.. ఈ నేపథ్యంలో అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.. అప్పుడే ఫలితాలకు ఎదురుచూపులు ఆరంభమయ్యాయి.. 1241 పోస్టులకు 60 వేల మంది క్యూలో ఉన్నారు.. ఎవరిని అదృష్టం వరిస్తుందో చూడాలి..

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం వచ్చింది..యువత కల తీరుస్తోంది..ఎన్నేళ్ల కలలనో తీరుస్తోంది. ప్రభుత్వ కొలువులు ప్రకటనలు విడుదల చేస్తూ అభ్యర్థుల ఎంపిక చేపడుతోంది. దీనిలో భాగంగానే గురువారం పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలను విడుదల చేసిన కూటమి సర్కారు డీఎస్సీ అభ్యర్థులకు తీపి కబురు చెప్పింది. ఫలితాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న వారికి శుభవార్త వినిపించింది. ఈ నెల ఒకటో తేదీనకీ విడుదల చేసిన విద్యాశాఖ ఈ నెల 15లోపు మెగా డీఎస్సీ-2025 ఫలితాలను విడుదల చేస్తామని విద్యాశాఖ ప్రకటించింది. దీంతో డీఎస్సీ అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే కీ పరిశీలనతో ఓ నిర్ణయానికి వచ్చిన అభ్యర్థులు ఫలితాలకు ఎదురుచూస్తున్నారు. 16 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన,నెలాఖరుకు కొత్త టీచర్ల పోస్టింగ్‌లు, శిక్షణ అన్నీ చకచకా జరగనున్నాయి.

63,004 దరఖాస్తులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా డీఎస్సీకి ఎక్కువ మంది దరఖాస్తు చేశారు. అన్ని మేనేజ్‌మెంట్లకు కలిపి 1241 పోస్టులు ఉండగా63,004 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో పోస్టుకు సగటున 50 దరఖాస్తులు రావడంతో అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అయితే ఈ సారి పురుషుల కన్నా మహిళలే దరఖాస్తు నమోదు లో ముందున్నారు.కేటగిరీల వారీగా ఓసీ-5120, బీసీ-ఎ 2810, బీసీ-బీ 6991, బీసీ-సీ 554, బీసీ-డి 3636, బీసీ-ఈ 568, ఎస్సీ గ్రేడ్-1 87, ఎస్సీ గ్రేడ్-2 2572, ఎస్సీ గ్రేడ్-3 10,066,ఎస్టీ 6,213, ఈడబ్ల్యూఎస్ 3,782,దివ్యాంగుల కేటగిరీ నుంచి వీహెచ్ 159, హెచ్‌హెచ్ 36, ఓహెచ్ 847, ఎంఐ ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు.

1241 ఉపాధ్యాయ పోస్టులు

ఉమ్మడి జిల్లాలో 1241 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ 608, పీఈటీలు 210, ఎస్జీటీ 423 పోస్టులు ఉన్నాయి.స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తెలుగు 65, హిందీ 78,ఆంగ్లం 95, గణితం 64, ఫిజికల్ సైన్స్ 71, బయోలాజికల్ సైన్స్ 103, సో షల్ 132, వ్యాయామవిద్య 210 ఉద్యోగాలతో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ల ఉద్యోగాలు ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమానికి సంబంధించి ఫిజికల్ సైన్స్ 3, బయోలాజికల్ సైన్స్ 4, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య 1, ఎస్జీటీలు 104 మొత్తం 112 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ప్రత్యేక విద్యకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 13 టీజీటీలు, 3 పీఈటీలు, 15 ఎస్జీటీలతో కలిపి 31 పోస్టులు ఉన్నాయి. జోన్-2 (ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా)కు సంబంధించి ఏపీ ఆర్ఎస్, ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూ, బీసీ, సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీఈటీ 24తో కలిపి మొత్తం 348 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు.

నాడు ఊరించి.. ఉసూరుమనిపించి..

గత వైసీపీ సర్కారు నిరుద్యోగులను నట్టేట ముంచింది. ఉద్యోగాల పేరుతో ఊరించి ఆ ఐదే ళ్లూ ఉసూరుమనిపించింది. ముఖ్యంగా మెగా డీఎస్సీ అంటూ దగా చేసింది. ఆ ఐదేళ్లు ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదు. దీంతో ఎంతో మంది అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు.ఆ ప్రభావం వైసీపీ ఓటమిపైనా పడింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే..ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ ప్రకటించింది.ఈ నెలాఖరుకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీని పూర్తి చేయనుంది.



వయసులు అరవై.. మనసులు ఇరవై!


అరెయ్ ఎలా ఉన్నావ్‌రా! ఒరెయ్ బాగున్నావా.. ఏమేవ్ ఏం చేస్తున్నావ్! ఈ మాటలు వింటుంటే ఎవరో పాఠశాల విద్యార్థులు మాట్లాడుకున్నట్టు ఉంది కదా.. అవును నిజమే వాళ్లు విద్యార్థులే కానీ వయసు 20 కాదు..60 ఏళ్లు పైనే.. ఎందుకంటే వాళ్లు పూర్వ విద్యార్థులు.. రాజమహేంద్రవరం ప్రకాశంనగర్ సెంటినరీ మునిసిపల్ హైస్కూల్‌లో 1974-1977లో 8,9,10 తరగతులు చదువుకున్నారు.. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం వారంతా గౌతమి ఘాట్‌లోని రివర్ బేలో కలుకుని 50 ఏళ్ల తమ స్నేహానికి గుర్తుగా పండుగ చేసుకున్నారు. స్నేహానికి వయసుతో పనేముంది.. ఎన్నేళ్లయినా.. ఎంత వయసొచ్చినా..స్నేహం చెక్కు చెదరదనడానికి ఈ సంఘటనే నిదర్శనంగా చెప్పుకోవచ్చు..

- రాజమహేంద్రవరం కల్చరల్

సిమ్ ఒక రూపాయి.. వ్యాలిడిటీ 30డేస్

ప్రస్తుతం ఏ నెట్ వర్క్ అయినా నెల రోజులు వ్యాలిడిటీ ప్లాన్‌కు రూ.200ల పైనే వసూలు చేస్తున్నాయి.. ఒక రూపాయికే సిమ్ కార్డ్ ఇచ్చి.. 30 రోజుల వ్యాలిడిటీ, అపరిమిత కాలింగ్, రోజుకి 2జీబీ డేటా, రోజుకు 100 మెసేజ్‌లు ఆఫర్ చేస్తే అదిరి పోద్ది కదా.. అయితే మీకు ఆ ఆఫర్ అందుబాటులోనే ఉంది. ఈ మేరకు ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ సరికొత్త ఫ్రీడం ప్లాన్ ప్రవేశపెట్టింది. ఎంఎన్‌పీ వినియోగదారులకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని బీఎస్ఎన్ఎల్ రాజమహేంద్రవరం బిజినెస్ ఏరియా ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు తెలిపారు. ఇంకెందుకు ఆలస్యం రూపాయి తీసుకెళదాం.. సిమ్ తెచ్చుకుందాం..సిమ్ కార్డుకు బీఎస్ఎన్ఎల్ సేవాకేంద్రాన్ని సం ప్రదించాలని సూచించారు.

- రాజమహేంద్రవరం కల్చరల్



ఉరుకుల్లేవ్.. పరుగుల్లేవ్..

ధవళేశ్వరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా తగ్గుముఖం పడుతున్న గోదావరి ఆదివారం నాటికి మరింత తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి ఆదివారం సాయంత్రానికి 2,57,545 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.దీంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 5 వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2300 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7000 క్యూసెక్కుల చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.



ఫైర్.. నో సేఫ్టీ!

- ప్రమాదంలో విపత్తుల నిర్వహణ శాఖ
- వెన్నాడుతున్న సిబ్బంది కొరత
- ఆఫీసు పనులకు కేటాయింపు నిల్
- తూర్పులో రెస్క్యూ బోటుకు చిల్లు
- మూడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి

ఫైర్ సిబ్బంది పనితనం ఎప్పుడు తెలుస్తుం ది.. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వారు హుటాహుటిన చేరుకుని ప్రమాదాన్ని అదుపులోకి తెచ్చినప్పుడే కదా..ప్రమాదం జరిగిన ప్పుడు విపత్తుల నిర్వహణ శాఖ అందుబాటులో లేకపోతే ఎలా? ప్రమాదాలను ఏమి అదుపు చేస్తారు.. ఎవరిని రక్షిస్తారు.. రాజమహేంద్రవరంలో శుక్రవారం ఎదురైన సంఘటనే అందుకు నిదర్శనం. ఫైర్‌స్టేషన్‌కు 2 అడుగుల దూరంలో ప్రమాదం జరిగినా ఫైర్ సిబ్బంది చేరుకోవడా నికి 45 నిమిషాలు పట్టింది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

విపత్తు సంభవించినప్పుడు ప్రతి సారీ ట్యాంకులో నీళ్లు నింపుకొని వెళ్తే పని జరగదు. విపత్తు నిర్వహణకు మానవ వనరులు, ఇతర పనిముట్లు లేకుండా చేసేదేమీ ఉండదు. ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భాల్లో ఎంత త్వరగా ఘటనా ప్రదేశానికి చేరుకుంటారనే అంశంపైనే నష్ట నివారణ ఆధారపడి ఉంటుంది. కానీ అగ్నిమాపకశాఖను కొరతలు వేధిస్తుండడంతో కాగితాల్లో లెక్కలకు వాస్తవ పరిస్థితికి వ్యత్యాసం ఉంటోంది. రెస్క్యూ పరికరాలు మరమ్మతుల్లో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. సగం సిబ్బందితోనే ఇబ్బందులు పడుతూ నెట్టుకొస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఒక షూమార్ట్‌లో శుక్రవారం ఉదయం ఫైర్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ప్రమాదం జరిగినా చేరుకోవడానికి 45 నిమిషాలు సమయం పట్టిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలి. జూన్ 4న గోదావరి లంక నుంచి నాటు పడవలో చీకటి పడిన వేళ వస్తూ ప్రమాదానికి గురై ఇద్దరు మృత్యువాత పడ్డారు.సమాచారం అందిన వెంటనే ఫైర్ ఇంజనుతో అగ్నిమాపక సిబ్బంది పుష్కరాల రేవుకు చేరుకున్నారు. తక్షణమే రంగంలోకి దిగాల్సి ఉన్నా దిగాలుగా నిలబడడం తప్పలేదు. ఎందుకంటే అందుబాటులో ఉన్న ఒక్క రెస్క్యూ బోట్‌కి చిల్లు పడిందని తెలిసింది. దీంతో గాలింపునకు నాటు పడవలే దిక్కయ్యాయి.దీంతో 4 గంటల క్లిష్టమైన సమయం గడిచిపోయింది. ఇటువంటి ఘటనలు అగ్నికి ఆజ్యంగా మారుతున్నాయి. 7 జిల్లాలకు సంబంధించి జోన్-2 ప్రాంతీయ ఫైర్ అధికారి రాజమండ్రిలోనే ఉన్నా పూర్తి స్థాయిలో విపత్తు నిర్వహణ కానరావడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.తూర్పుగోదావరి, కాకినాడ,అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని విపత్తు నిర్వహణ శాఖ తిప్పల పై 'ఆంధ్రజ్యోతి' కథనం

సిబ్బంది కొరత

విపత్తు నిర్వహణ శాఖలో సిబ్బంది కొరత అంతర్గత విపత్తులా మారింది. సిబ్బంది సరిపడా లేకపోవడం వల్ల అందుబాటులో ఉన్న సిబ్బందిపైనే భారం పడుతోంది. అత్యవసర సర్వీసు కాబట్టి డ్యూటీల్లో వెసులుబాట్లు ఉండడంలేదు. దీంతో ఉద్యోగులు అనారోగ్యాల బారిన పడుతుండగా.. కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. ఎగ్జిక్యూటివ్ స్టాఫ్ కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో 150 వరకూ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏవో, జేఏవో,సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్ట్, ఆఫీస్ సబార్డినేట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు కార్యాలయ నిర్వహణకు అవసరం. వీరిని మినిస్టీరియల్ సిబ్బంది అంటారు. అయితే మూడు జిల్లాలకు ఇద్దరేసి చొప్పున జూనియర్ అసిస్టెంట్ల పోస్టులు మాత్రమే కేటాయింపు ఉంది. కోనసీమ, తూర్పు గోదావరిలో వారూ లేరు.అధికారులే లెటర్ టైప్ చేసుకొని ప్రింట్ తీసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

వాణిజ్య ప్రాంతాల్లో భయం..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వాణిజ్య కేంద్రంగా రాజమహేంద్రవరం ఉంది. గృహోపకరణాల దగ్గర నుంచీ అన్నీ లభ్యమవుతాయి. సుమారు 2 వేలకుపైగా దుకాణాల్లో రోజూ కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. ప్రధానంగా దుకాణాలన్నీ పెద్ద బజారు, గోదావరి గట్టును ఆనుకొని ఉన్న ప్రాంతంలో ఉన్నాయి. అధిక శాతం షాపుల్లో కనీస అగ్నిమాపక సామగ్రి ఉండదు. ఫైర్ సేఫ్టీ ఉండదు.షాపుల మధ్య కనీస దూరం ఉండదు. కొన్ని సందుల్లోకి బైక్ కూడా వెళ్లని పరిస్థితి ఉంది. ఏదైనా జరగరానిది జరిగితే ఫైర్ బుల్లెట్లు వెళ్లలేని దుస్థితి. దుకాణాల్లోని ఫ్లోర్‌లను లేదా గదులను గోదాములుగా ఉపయోగిస్తుంటారు. కానీ ఫైర్ సేఫ్టీ ఉండదు. మోచీ వీధి,పెద్ద బజారు, నల్ల మందు సందు ఇలా ఇక్కడ చాలా వాణిజ్య ప్రదేశాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో అర్ధ రాత్రి వేళ ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే అంతే. ప్రాణాలతో బయట పడడం కష్టమే. ఎక్కువ శాతం పాత భవనాలు ఉండడంతో ఎలక్ట్రికల్ వైరింగ్ ఏనాటిదో ఉంది. ఇవన్నీ పట్టించుకోవడానికి యంత్రాంగానికి సమయం లేదు. మూడు జిల్లాల్లోని వాణిజ్య ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి అగ్నిమాపక చర్యలు తీసుకోవాలనే వాదన బలంగా వినబడుతోంది.

పనిముట్ల పరిస్థితి అంతే

విపత్తు వేళ సిబ్బంది ఎంత సామర్థ్యం కలిగిన వారు ఉన్నా పనిముట్లు, పరికరాలు లేకపోతే సమయం వృథా తప్పదు. కళ్ల ముందే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. మూడు జిల్లాలోని రెస్క్యూ ఎక్విప్‌మెంట్ పూర్తి స్థాయిలో మనుగడలో లేదు.కొన్ని మరమ్మతులో ఉండగా, మరికొన్ని మూలకు చేరిపోయాయి.పలు స్టేషన్లలో అన్నీ ఉన్నా సరిపడా సిబ్బంది లేరు. గోదావరికి వరదల సమయంలో జనాన్ని, పశువులను రక్షించడానికి కూడా నాటు పడవలే గత్యంతరం. తూర్పుగోదావరిలో విస్తార గోదావరి తీరం ఉంది.ప్రతి ఏడాదీ వరదలు సహజమే. ఈ నాటికీ ఒక్క రెస్క్యూ బోటు కూడా సమకూర్చుకోలేని దైన్యంలో విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ కొట్టుమిట్టాడుతోంది.

సామర్లకోటలో దారుణం

తల్లీ, ఇద్దరు కమార్తెల హత్య

తలపై బలమైన ఆయుధంతో గట్టిగా కొట్టి చంపినట్టు భావిస్తున్న పోలీసులు



భార్య, కుమార్తెల మృతదేహాల వద్ద బోరున విలపిస్తున్న ప్రసాద్

సామర్లకోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో ఆదివారం దారుణమైన సంఘటన జరిగింది. పట్టణంలోని సీతారామ కాలనీలో ఒక ఇంట్లోని తల్లి, ఇద్దరు కుమార్తెలు దారుణ హత్యకు గురయ్యారు. కుమార్తెల్లో ఒకరికి ఎనిమిదేళ్లు కాగా మరొకరికి ఆరేళ్లు కావడం విచారకరం. రోజూలాగే లారీ డ్రైవర్‌గా విధులకు వెళ్లిన వ్యక్తి ఉదయం ఇంటికి వచ్చి చూడగా తన భార్య, కూతుళ్లు విగత జీవులుగా రక్తపుమడుగులో పడి ఉండడంతో ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు గురయ్యాడు.

అసలేం జరిగింది?

వివరాల్లోకి వెళితే సామర్లకోట బ్రౌన్‌పేటకు చెందిన లారీ డ్రైవర్ ములపర్తి ప్రసాద్‌కు కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామానికి చెందిన మాధురి(26)తో పదేళ్ల క్రితం వివాహం అయ్యింది. వారికి కుమార్తెలు ములపర్తి పుష్పకుమారి (8), జెస్సీలోవ(6) ఉన్నారు. ఈ కుటుంబం గత కొంతకాలంగా బ్రౌన్‌పేటకు సమీపాన గల సీతారామకాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రసాద్ ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన వాహనంపై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ లాగే శనివారం రాత్రి విధులకు వెళ్లి తిరిగి ఆదివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఎంతకూ తలుపులు తీయకపోవడంతో వెనక తలుపులు తొలగించి లోపలికి వెళ్లగా గదిలో భార్య, కుమార్తెలు విగతజీవులుగా రక్తపు మడుగులో ఉండడాన్ని చూసి షాక్ తిన్నాడు. దీంతో సామర్లకోట పోలీసులకు సమాచారం అందించాడు. సామర్లకోట సీఐ కృష్ణభగవాన్



మాధురి (ఫైల్)



పుష్పకుమారి, జెస్సీలోవ (ఫైల్)



సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మరోపక్క కాకినాడకు చెందిన క్లూస్ టీం బృందాలు సంఘటనా స్థలిలో వేలి ముద్రలను సేకరించడంతో పాటు పోలీసు జాగిలాలను వదిలారు. ముగ్గురినీ తలపై బలమైన ఆయుధంతో గట్టిగా కొట్టి హతమార్చినట్టు పోలీసులు ప్రాథమికంగా భావించారు.

పోలీసు బృందాల గాలింపు : ఎస్పీ

కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ హుటాహుటిన సామర్లకోట చేరుకుని సంఘటనకు దారితీసిన పరిస్థితులపై సామర్లకోట పోలీసు అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకర్లతో ఎస్పీ మాట్లాడుతూ తల్లీ, ఇద్దరు కుమార్తెలను హత్య చేసినవారిని తక్షణం అరెస్ట్ చేసేందుకు పోలీసు బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించినట్టు వెల్లడించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఎస్పీ వెంట పాల్గొన్నారు ఉన్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురు దారుణ హత్యకు గురికావడంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.

కుమార్తెకు తెచ్చిన పెళ్లి సంబంధం నచ్చలేదని వెళ్లి

కాలువలో మృతదేహంగా తేలి...

జగ్గంపేట రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కుమార్తెకు తెచ్చిన పెళ్లి సంబంధం నచ్చలేదని ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం పురుషోత్తపట్నం పేజ్2 పక్కన కాలువలో మహిళ మృతదేహంగా తేలింది. మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ఒడ్డుకు తీసి దర్యాప్తు చేపట్టారు. దీనిలో భాగంగా పెద్దాపురం రాజు కాలనీకి చెందిన గడిగట్ల వరలక్ష్మి (47)గా నిర్ధారణ అయింది. ఆమెకు భర్త సాయిబాబా, ఇద్దరు కూతుర్లు ఉన్నట్టు గుర్తించారు. అయితే చిన్న కుమార్తెకు భర్త సాయిబాబా ఇటీవల పెళ్లి సంబంధం తీసుకురావడం, ఆ సంబంధం వరలక్ష్మికి నచ్చకపోవడంతో కుటుంబంలో కలహాలు వచ్చాయని, ఈనెల 2న ఉదయం ఇంటి నుంచి వరలక్ష్మి బయటకు వెళ్లిపోతుండగా కూతురు అడ్డుపడినా వెళ్లిపోయిందని భర్త సాయిబాబా పోలీసులకు తెలిపాడు. వెంటనే జగ్గంపేటలోని బంధువుల ఇళ్ల వద్ద వెతుకుతుండగా కాలువలో మృతదేహం లభ్యమైనట్టు తెలిసి వెళ్లి చూడగా తన భార్య వరలక్ష్మిగా గుర్తిం చినట్టు సాయిబాబా తెలిపాడు. పెళ్లి సంబంధం ఇష్టం లేక ఇంటి నుంచి బయటకు వచ్చేసిందని, వరలక్ష్మి కాలువలో ప్రమాదవశాత్తు జారిపడిందో లేక దూకేసిందో తెలియాల్సి ఉందని ఎస్ఐ రఘునా థరావు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



గడిగట్ల వరలక్ష్మి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో జనసేన నాయకుడు మృతి

పి.గన్నవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముంగండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిమ్ నిర్వాహకుడు, జనసేన నాయకుడు కత్తుల శ్రీనివాసరావు(35) మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు శ్రీనివాసరావు గత కొంతకాలంగా పోతవరంలో జిమ్ నిర్వహిస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వై.కొత్తపల్లి వెళ్తుండగా మార్గం మధ్యలో ముంగండ ముత్యాలమ్మ గుడి సమీపంలోకి వెళ్లే సరికి కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి సమీపంలో ఉన్న గోడను ఢీకొన్నా డు. దీంతో తలతో పాటు శరీరభాగాలకు బలమైన గాయాలు కావడంతో అంబాజీపేటలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సలహామేరకు వైద్యం నిమిత్తం కాకినాడ తరలించడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లేసరికి శ్రీను మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. శ్రీను అకాలమరణంతో వై.కొత్తపల్లిలో విషాద చాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని అమ లాపురం ప్రభుత్వాసుప త్రికి తరలించి కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీను పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని తెలిపారు.



శ్రీనివాసరావు (ఫైల్)

నేటి నుంచి

వాడపల్లిలో పవిత్రోత్సవాలు

మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం తిరుమల తరహాలో సోమవారం నుంచి 3 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు సకల దోశ పరిహార్థం పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యహవచనం, దీక్షాధారణ, అకల్మస హోమం, సాయంత్రం అంకుర్పారణ, నవమూర్తి ఆవాహన, పంచసయ్యాదివాసం... మంగళవారం ఉదయం అష్టకళస స్థాపన, మహాశాంతిహోమం, సాయంత్రం పవిత్ర ఆరోహణ నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం పవిత్ర విసర్జన, మహాపూర్ణాహుతి, కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొననున్నారు. ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో ప్రతిరోజు నిర్వహించే అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు, ఉపనయనాలు రద్దు చేయడం జరిగిందని, 7వ తేదీన యథావిధిగా కార్యక్రమాలు జరుగుతాయని ఈవో తెలిపారు.



వాడపల్లిలో వేంకటేశ్వరస్వామికి పవిత్రాలతో అలంకరణ (ఫైల్)

16 నుంచి విజయదుర్గా పీఠం వార్షికోత్సవాలు



పీఠంలో వార్షికోత్సవాల కరపత్రం విడుదల చేస్తున్న గాడ్ తదితరులు

రాయవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా పీఠం 53వ వార్షికోత్సవాలు ఈనెల 16, 17, 18 తేదీల్లో నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. ఆదివారం పీఠంలో ఆయన మాట్లాడుతూ 16న ఉదయం 8గంటల 45 నిమిషాలకు గాడ్ కుమార్తె సత్యవెంకట కామేశ్వరి చేతులమీదుగా జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభిస్తారని చెప్పారు. 16న ఉదయం భద్రాచలం వేదపండితులతో శ్రీసీతారాముల కల్యాణం, సాయంత్రం 6:30 గంటలకు నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన ఆధ్యాత్మికవేత్త కోట సునీల్ కుమార్ ఆధ్వర్యంలో శక్తిమాల, మణిద్వీప వర్ణనశ్లోకాల పారాయణం, సువాసినిల పూజల జరుగుతుందన్నారు. 17న ఉదయం నెల్లూరు జిల్లా జొన్నవాడ కామాక్షి తాయి ఆలయ అర్చకులతో నవారణ అర్చన, సాయంత్ర అన్నవరం వేదపండితులతో రమా సహిత వీరవెంకట సత్యనారాయణస్వామి కల్యాణం, 18న తిరుమల వేదపండితులతో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం వైఖానస ఆగమం ప్రకారం జరుగుతుందని, రాత్రి 7 గంటలకు విజయదుర్గా అమ్మవారికి లక్ష గులాబీల పూజ జరుగుతాయన్నారు. వార్షికోత్సవ వేడుకల కరపత్రాన్ని పీఠాధిపతి గాడ్ చేతులమీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఠం పీఆర్వో బాబి తదితరులు ఉన్నారు.

భీమేశ్వరాలయంలో రైల్వే డీఆర్ఎం ప్రత్యేక పూజలు



భీమేశ్వరాలయంలో వేదాశీర్వచనం పొందుతున్న రైల్వే డీఆర్ఎం

సామర్లకోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనకియా ఆదివారం సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు డీఆర్ఎంకు సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా ఆలయంలోని అన్ని ఉపాలయాల దేవతామూర్తులను దర్శించారు. అనంతరం భీమేశ్వరస్వామికి విశేష అభిషేక పూజలు, బాలాత్రిపుర సుందరికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు. నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో ప్రసాదాలు స్వీకరించారు. ఈవో స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని అందజేశారు.

ఉత్కంఠగా..

కాకినాడలో మూడో రోజు జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు



హాకీ ఆడుతున్న ఉత్తరాఖండ్, అస్సాం జట్లు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరుగుతున్న ఇండియన్ ఆయిల్ 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్ షిప్-2025లో భాగంగా ఆదివారం మూడోరోజు రెండు మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. మ్యాచ్‌ల ఫలితం తేలక డ్రాగానే ముగిశాయి. ఇరు జట్లు గోల్స్ చేయడానికి పోటీపడ్డాయి. దీంతో ఉత్కంఠగా మ్యాచ్‌లు సాగాయి.

మ్యాచ్‌ల వివరాలు...

కాకినాడ క్రీడా మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్ లోని రెండు మ్యాచ్‌లు జరిగాయి. ఉత్తరాఖండ్ వర్సెస్ అస్సాం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 2-2 స్కోరు నమోదు చేయడంతో డ్రాగా ముగిసింది. బీహార్ వర్సెస్ తమిళనాడు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 2-2 స్కోరు నమోదు చేయడంతో డ్రాగా ముగిసింది. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సీఈవో హెడ్ ఆఫ్ ఫైనాన్స్ డి.రమణమూర్తి, కేంద్ర మంత్రిత్వ హైవే ఇండస్ట్రీస్ డైరెక్టర్ జీ.సత్తిబాబు ముఖ్య అతిథులుగా హాజరై మ్యాచ్‌లను వీక్షించారు. డీఎస్డీవో బి.శ్రీనివాస్ తదితరులు మ్యాచ్‌లను పర్యవేక్షించారు.



మ్యాచ్ తిలకిస్తున్న ముఖ్య అతిథులు





ఉత్తరాఖండ్ ప్లేయర్‌కి ప్లేయర్ ఆఫ్ ది అవార్డు అందిస్తున్న రమణమూర్తి

నిడదవోలులో చోరీ



ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ దేవకుమార్

నిడదవోలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు సంజీవయ్యనగర్ (బుక్కాపేట)లోని మనుబోలు వెంకటేశ్వరరావు ఇంట్లో భారీ చోరీ జరిగింది. గత వారం రోజులుగా ఇంటి యజమానికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో విజయవాడలో ఉంటున్నారు. శనివారం రాత్రి ఆ కుటుంబం ఇంటికి చేరుకోగా ఇంట్లో దొంగలు పడినట్టు గుర్తించారు. సుమారు 20 కాసుల బంగారం, వెండి, నగదు చోరీ అయ్యాయని మనుబోలు గౌతమి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనా స్థలాన్ని అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, సీసీఎస్ క్రైమ్ సీఐ శ్రీధర్‌కుమార్ తదితరులు పరిశీలించారు. క్లూస్‌టీం ఆ ఇంటి తలుపులపై నమోదైన వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ తెలిపారు.

ఎన్‌కౌంటర్‌పై 6న విచారణ

రంపచోడవరం, ఆగస్టు 3 (ఆంధ్రజోతి): ఇటీవల కింటుకూరు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై ఈనెల 6న బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో మెజిస్ట్రీయల్ విచారణ చేపడుతున్నట్టు సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ ఆదివారం ప్రకటనలో తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో భక్తుల రద్దీ

రూ.35 లక్షల ఆదాయం



రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సెలవుదినం, స్నేహితుల దినోత్సవం కారణంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామి సన్నిధికి విచ్చేసి స్వామివారి వ్రతం, దర్శనాలు చేసుకున్నారు. ప్రత్యేక దర్శనానికి గంట వ్యవధి, ఉచిత దర్శనానికి రెండు గంటల సమయం భక్తులు వేచిఉన్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఈవో సుబ్బారావు ఏర్పాట్లు చేశారు. ఆలయంలో 2800 వ్రతాలు జరగగా రూ.35 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుడికి ఆర్జిత సేవైన రథోత్సవం ఘనంగా జరిగింది.

నేటి నుంచి వనదుర్గమ్మకు ప్రత్యేక అలంకరణలు

రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ అమ్మవారికి సోమవారం నుంచి శ్రావణ మాసోత్సవాలు పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం లక్ష కుంకుమార్చనలు జరుగుతాయని భక్తులు పాల్గొనాలని దేవస్థానం అధికారులు కోరారు.

'లోవ'లో భక్తుల కోలాహలం

రూ.5.41 లక్షల ఆదాయం



ఆలయ ప్రాంగణంలో భక్తులు, దర్శనమిస్తున్న తలుపులమ్మ

తునిరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపు లమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. వేలాది భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిసింది. ప్రత్యేక క్యూలలో బారులుతీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. ఆదివారం రూ.5.41 లక్షలు ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధరాజు తెలిపారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక

జగ్గంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట గవర్నమెంట్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులను రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక చేసినట్టు జూడో జిమ్ అండ్ కరాటే మాస్టర్ టీవీవీ రమణ తెలిపారు. బి.ఓంకార్, టి.వివేక్, పి.జయ, బిబ్లేస్సిరాజ్, జె.రవీంద్ర, అభి, కె.సింహాచలం, వి.శ్రీలక్ష్మి, ఏ.దుర్గాధరన్, సీహెచ్ శ్రీరామ్, వి.వీరమణికంఠ, కెఎస్.రాజ్, ఎ.శిరీష, బి.తేజస్వి, బి.దయ, టి.వైష్ణవి, పి.సంజయ్, జి.ఆదిశంకర్, డి.శ్రీనివాస్, జి.జోషఫ్, శ్రీరామ్ జి.పరమేశ్వరి, టి.సంధ్య గాయత్రి, ఏఎస్‌బి.అమృతలు పల్నాడు జిల్లాలో ఈనెల 9,10న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులను కాకినాడ డీఎస్సీ కోచ్ తేజ, సాయి కృష్ణ, దేవి కృష్ణశ్రావణ్ తులసి పలువురు అభినందించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పూర్వ విద్యార్థులు.. అపూర్వ కలయికలు





కాకినాడలో కలిసిన పదోతరగతి పూర్వ విద్యార్థులు, సామర్లకోటలో పూర్వ విద్యార్థులు

కాకినాడ రూరల్/సామర్లకోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో 1996-97లో చదువుకున్న విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు పలుకరించుకుని ఆనాటి తీపిజ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. సమ్మేళనంలో రాష్ట్ర ఇంటర్‌విద్య అదనపు డైరెక్టర్ పి.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా.. ప్రత్యేక అతిథులుగా కాంతారావు, మల్లేశ్వరరావు, సూర్యకాంతం, సుబ్రహ్మణ్యం, ఆర్జేడీ రాజు, సుందర్‌బాబు, శేషగిరి, రోహిణి, హెల్డా, సత్యనారయణమ్మ పాల్గొన్నారు. పూర్వవిద్యార్థులు తమ గురువులందర్నీ సత్కరించారు. సమ్మేళనంలో పాఠశాల విద్య జోన్-2ఆర్జేడీ జి.నాగమణి, డీఈవో పి.రమేష్, ఏపీసీ పి.వేణుగోపాలరావు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొనగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని ప్రేమజ్యోతి అధ్యక్షత వహించారు. అలాగే 42 ఏళ్ల క్రితం సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకూ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలిశారు. ఫ్రెడ్‌షిప్‌డే సందర్భంగా వీరంతా ఒకే వేదికపై కలుసుకుని నాటి అల్లరిపనులు, చిలిపిచేష్టలను గుర్తు చేసుకుని కేరింతలు కొట్టారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



బాలకృష్ణ (ఫైల్)

మండపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజమహేంద్రవరం జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ వై.నాగేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన గుత్తుల యువబాలకృష్ణ (26) మండపేట పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. నానమ్మ వద్ద ఉంటున్నాడు. అతడి తల్లి హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. బాలకృష్ణ నానమ్మ వద్ద ఉంటున్నాడు. పలు కారణాల వల్ల జీవితంపై విరక్తి చెందిన బాలకృష్ణ ఈనెల 2న ద్వారపూడి రైల్వేస్టేషన్‌లో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌కు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం యువకుడు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఆదివారం అప్పగించామని హెడ్‌కానిస్టేబుల్ వై.నాగేశ్వరరావు తెలిపారు.

గేదెను ఢీకొని యువకుడి మృతి

మరొకరికి గాయాలు



తాతాజీవర్మ (ఫైల్)

తాళ్లరేవు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరింగ 216 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. కోరింగ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెం గ్రామానికి చెందిన కొప్పాడి తాతాజీవర్మ (19) స్నేహితుడుతో కలసి ద్విచక్రవాహనంపై కాకినాడ బయలుదేరారు. కోరింగ దుర్గమ్మగుడి ప్రాంతానికి వచ్చేసరికి ద్విచక్రవాహనానికి గేదె అడ్డురావడంతో ఢీకొని ఇద్దరు కిందపడ్డారు. దీంతో తాతాజీవర్మ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్నేహితుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. తాతాజీ వర్మ మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు.

తండ్రిపై హత్యాయత్నం కేసులో కుమారుడికి రిమాండ్

అమలాపురం రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మానవత్వాన్ని మరిచి బీమా సొమ్ముల కోసం తండ్రి వెంకటరమణపై హత్యా యత్నం చేసిన కేసులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం సాకుర్రుకు చెందిన వైసీపీ యువ నాయకుడు విప్పర్తి హర్షవర్ధన్‌కు ఈ నెల 14వ తేదీ వరకు కోర్టు రిమాండ్ విధించినట్టు అమలాపురం తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. హర్షవర్ధన్‌ను అమలాపురం ఏజేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ రహ్మతుల్లా ముందు హాజరు పరుచగా రిమాండ్ విధించగా కొత్తపేట సబ్ జైలుకు తరలించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

గొల్లప్రోలు రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో పేకాడుతున్న వారిపై ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం దాడి చేశారు. సిద్దా రాంబాబు, షేక్ రహీంబాబును అరెస్టు చేసి వారి నుంచి రూ2,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన వారు పరారయ్యారు. ఇద్దరినీ కోర్టులో హాజరుపరచనున్నట్టు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు పట్టణ శివారులో పేకాట శిబిరంపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఆరుగురిని అరెస్టు చేసి రూ.17,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

పొంచి ఉన్న ప్రమాదం

- మల్లయ్యపేట సెంటర్‌లో కుంగిపోయిన కల్వర్టు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహన దారులు, స్థానికులు



ఆనంద్‌నగర్-మల్లయ్యపేట సెంటర్‌లో కుంగిన మెయిన్ రోడ్డు కల్వర్టు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆనంద్‌నగర్-మల్లయ్యపేట రోడ్డు జంక్షన్‌లో కల్వర్టు శ్లాబ్ పగిలిపోయి గుంతగా ఏర్పడి ప్రమాదకరంగా మారింది.రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామ పరిధిలోని మల్లయ్యపేట గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ఆనంద్‌నగర్ క్వారీ సెంటర్‌కు వెళ్లే రోడ్డులో మల్లయ్యపేట వద్ద రోడ్డు కల్వర్టు శ్లాబ్ పగిలిపోయి గుంతగా ఏర్పడింది. ఈ రోడ్డులో నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ప్రైవేట్ స్కూల్, కళాశాలల బస్సులు, కార్లు, మెటల్, ఇసుక లారీలు అన్నీ కాతేరు మీదుగా మల్లయ్యపేట సెంటర్ నుంచి క్వారీ సెంటర్ వెళ్లేందుకు ఈ కల్వర్టు మీదుగానే వాహనాలు వెళ్తాయి. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది.ఈ భారీ వాహనాల తాకిడికి కల్వర్టు శ్లాబ్ దిగిపోయి గుంత ఏర్పడింది. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులు గడచిన దానిని పట్టించుకునే వారే లేరు.

సరిహద్దుల గందరగోళం

స్థానికులు కల్వర్టు సమస్యపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే కల్వర్టు కూలిపోయిన ప్రదేశం కాతేరు పంచాయతీ పరిధిలో ఉంది. రోడ్డు ఆనంద్‌నగర్‌కు కనెక్టింగ్‌లో ఉంది. ఆర్అండ్‌బీ అధికారులు మల్లయ్యపేట కాతేరు మెయిన్ రోడ్డు మాత్రమే తమ పరిధి అని చెబుతున్నారు. కార్పొరేషన్ పరిధిలోది కాదు కాబట్టి వాళ్లు తొంగి చూడలేదు. ఇక పంచాయతీ వాళ్లు కూడా పట్టించుకోలేదు.అధికారులు స్పందించి కల్వర్టు శ్లాబ్ వేసి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

అన్నదాత సుఖీభవపై

మాజీ మంత్రులకు అవగాహన లేదు

శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకంపై మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణులకు కనీస అవగాహన లేదని రాష్ట్ర శెట్టిబలిజ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు న్యాయం చేసింది కూటమి ప్రభుత్వమేనన్నారు. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు వెరసి రూ.20 వేలు అందజేస్తోందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం తన వాటా కింద రూ.7,500, కేంద్రం వాటా కింద రూ.6 వేలు వెరసి రూ.13,500 మాత్రమే ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం రూ.6,500 పెంచి రైతులకు న్యాయం చేసిందని ఇది మోసం ఎలా అవుతుందన్నారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజాసంక్షేమాన్ని చూసి తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారన్నారు.

ఆకట్టుకున్న ఆలయ నృత్య ప్రదర్శన



నవజనార్దన పారిజాతం ఆలయ నృత్య ప్రదర్శన

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నాట్యకళా కోవిదులు సప్పా దుర్గాప్రసాద్ శిష్యులతో ఆదివారం స్థానిక గోదావరి గట్టునున్న శ్రీ త్యాగరాజ నారాయణ దాస సేవా సమితి ప్రాంగణంలో నవజనార్దన పారిజాతం ఆలయ నృత్య ప్రదర్శన జరిగింది. గోదావరి తీరంలోనే అతి పెద్ద నాట్య ప్రక్రియగా ప్రసిద్ధి పొందిన నవజనార్దన పారిజాతం, భామాకలాపాన్ని జి.రిషిక, శాన్విక, రూపాశ్రీలు తమ నాట్యాభినయనంతో ప్రేక్షకులను అలరించారు. దుర్గాప్రసాద్ నవజనార్దన పారిజాత భామాకలాపంలో తాను చూపిన అభినయానికి ప్రేక్షకులు కరతాల ధ్వనులతో అభినందించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌ను, నర్తకిలను సద్గురు సన్నిధి వ్యవస్థాపకుడు శిష్టు మధుసూదనరావు సన్మానించారు.

ఆరోగ్య సహాయకుల పునర్నియామకంలో

సుప్రీం కోర్టు తీరు ఆశాజనకం

ఏపీ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ప్రసాద్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడిన వైద్య, ఆరోగ్యశాఖ ఆరోగ్య సహాయకుల పునర్నియామకం విషయంలో సుప్రీంకోర్టు స్పందించిన తీరు ఆశాజనకంగా ఉందని ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎన్నో ఏళ్ల నుంచి వైద్యసహాయకులుగా పనిచేస్తున్న వారిని ఒక్కసారిగా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. సుప్రీం కోర్టు చేసిన సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ వ్యవహారాన్ని చక్కదిద్దే ఆలోచన చేస్తుందనే ఆశ కలుగుతోందన్నారు. చిరుద్యోగులైన ఆరోగ్యసహాయకుల విషయంలో ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందనే ఎదురుచూస్తున్నామని, సుప్రీంకోర్టు సైతం సానుకూలంగా ఆలోచిస్తుండడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, అందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో కైలాస గౌరీ నోము



ఎమ్మెల్యే బత్తులకు తులసి, పారిజాత మొక్కలను అందజేస్తున్న దృశ్యం

కోరుకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కోరుకొండలో నూతనంగా నిర్మించిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం కైలాస గౌరీ నోము చేపట్టారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభించిన ఈ నోమును జనసేన పార్టీ నాయకుడు జల్లు సుబ్రహ్మణ్యం, లావణ్య దంపతులు నోచారు. కార్యక్రమానికి వచ్చిన మహిళలకు పసుపు, కుంకుమ, తులసి, పారిజాత మొక్కలను, పువ్వులు, రవికల ముక్కలు అందజేశారు. కార్యక్రమానికి ముందు ఆలయంలో పూలమొక్కలు, పుష్పాలతో బృందావనం ఏర్పాటు చేసి రాధాకృష్ణులను అలంకరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బదిరెడ్డి దొర, యర్రంశెట్టి పోలారావు, నాతిపాము దొరబాబు, తెలగంశెట్టి శివ, అడ్డాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మ ఆలయ శిఖర పునః ప్రతిష్ఠ



కార్యక్రమం నిర్వహిస్తున్న సతీష్‌రెడ్డి పూర్ణ గౌతమి దంపతులు

అనపర్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని శాంతిపురంలో శ్రీ గణపతి సరస్వతి సహిత మహాలక్ష్మి అమ్మవారి ఆలయ శిఖర పునః ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కొవ్వూరి సతీష్‌రెడ్డి పూర్ణ గౌతమి దంపతుల చేతుల మీదుగా ఆలయార్చకులు, వేద పండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వినాయక చవితికి పందిరి రాట



రాట ముహూర్తంలో పాల్గొన్న కుడుపూడి సత్తిబాబు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న ప్రారంభంకానున్న వినాయక చవితి ఉత్సవాలకు రాజేంద్రనగర్ రచ్చబండ వినాయక ఆలయం వద్ద రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో ఆదివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఉత్సవాలను రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుత్తుల జోగారావు, కడిమి శేఖర్, కడిమి ప్రసాద్, బొంత శ్రీహరి, ముురగ రాము, బ్రహ్మాజీ, సాగి గంగాధర్ పాల్గొన్నారు.

ప్రయాణికుల దాహార్తి

- గోకవరం ఆర్టీసీ డిపోలో తాగునీటి సమస్య
- పట్టించుకోని నిర్వాహకులు.. ప్రయాణికుల అవస్థలు



గోకవరంలో తాగునీటి సరఫరా లేకపోవడంతో ఆర్టీసీ డిపోలో వాటర్ ట్యాంక్‌కు తాళాలు వేసిన దృశ్యం

గోకవరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది మంది ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండే గోకవరం ఆర్టీసీ డిపోలో తాగునీటి ఎద్దడి నెలకొంది. సుమారు నెల రోజుల పైబడి ఇక్కడ తాగునీటి సమస్య నెలకొన్నప్పటికీ డిపో యాజమాన్యం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. కొంతకాలంగా సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లై కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు దిగడంతో డిపోలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌కు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. అప్పటి నుంచి ప్రయాణికులు వినియోగించే వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా మారిపోయింది. దీంతో ప్రయాణికులకు డిపో ఆవరణలో ఎక్కడా తాగునీరు లభించడంలేదు. దీంతో ఈ డిపో నుంచి రాకపోకలు సాగించే వారు బయట దుకాణాల వద్ద వాటర్ బాటిళ్లు కొనుగోలు చేసుకొని దాహం తీర్చుకుంటున్నారు.

ప్రత్యామ్నాయం చూపలేదు

డిపో ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్‌కు మంచినీరు సరఫరా లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా తాగునీటి సమస్య వేధిస్తున్నప్పటికీ డిపో నిర్వాహకులు ప్రత్యామ్నాయ మార్గాలు చూపకపోవడంతో ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సప్లై కార్మికులు సమ్మె విరమిస్తేనే గాని డిపోకు వచ్చే ప్రయాణికులకు తాగునీరు లభించే అవకాశం లేదని ప్రయాణికులు అంటున్నారు.

రైతులకు మేలు జరగాలి

- మార్కెట్‌యార్డు ఆదాయం పెంచాలి
- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం



ఏఎంసీ నూతన పాలక మండలితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం అర్బన్/కడియం/ధవళేశ్వరం , ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన వ్యవసాయ మార్కెట్ కమిటీలను తిరిగి గాడిలో పెట్టేందుకు ఆర్థికంగా పరిపుష్టం చేయడానికి నూతన పాలక మండలి చర్యలు తీసుకోవాలని, ఆదాయం పెంచుకోవడంతోపాటు చిన్న సన్నకారు రైతులకు మేలు జరిగే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం కోరుకొండ రోడ్డులోని మార్కెట్‌యార్డు ఆవరణలో నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మార్ని వాసుదేవ్, ఉపాధ్యక్షుడిగా నర్సరీ సంఘం ఉపాధ్యక్షుడు బోడపాటి గోపాలకృష్ణ(గోపి), డైరెక్టర్లుగా జనసేన నాయకుడు జంగా వినోద్ (వేమగిరిగట్టు), మురమండ టీడీపీ అధ్యక్షుడు దేవళ్ల రామ్మోహనరావు, గ్రంధి విజయలక్ష్మి(దుళ్ల) తదితర పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే గోరంట్ల ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ మార్కెట్‌యార్డు ఆస్తులను పరిరక్షించాలని, మార్కెట్ యార్డు ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఏటా ఆదాయం రూ.6 కోట్లకు పెంచుకునేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. మార్ని వాసుదేవ్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆర్గానిక్ వ్యవసాయం చేయడంతో పాటు ఆ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వం, ఎమ్మెల్యేలు, అధికారులు సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. కాగా, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, సిటీలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మార్కెట్ కమిటీ పాలక మండలి సభ్యులు, రాజమహేంద్రవరం రూరల్, కడియం మండలాల తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఏఎంసీ కార్యదర్శి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారీ ఎత్తున కూటమి నాయకులు, నర్సరీ రైతులు కడియపులంక అంబికా నర్సరీకి చేరుకుని అక్కడ నుంచి, ధవళేశ్వరం నుంచి డైరెక్టర్లుగా నియమితులైన టీడీపీకి చెందిన బండి శ్రీజ్యోతి, జనసేనకు చెందిన కొప్పిశెట్టి గాంధీ, బీజేపీకి చెందిన పన్నాల లక్ష్మీసంతోషి కూటమి నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా రాజమహేంద్రవరం చేరుకున్నారు. ప్రమాణ స్వీకారం చేసిన పాలక మండలికి ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, గట్టి సుబ్బారావు, వరగోగుల వెంకటేశ్వరరావు, చిట్టూరి అమ్మిరాజు, గట్టి నర్సయ్య, పీవీవీ సత్యనారాయణ, గుర్రపు సత్యనారాయణ, నర్సరీసంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, డైరెక్టర్లు కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.



మార్కెట్‌యార్డుకు ర్యాలీగా వెళ్తున్న చైర్మన్ వాసుదేవ్



ధవళేశ్వరం నుంచి ర్యాలీగా వెళుతున్న నాయకులు

తల్లీకూతుళ్ల అదృశ్యం



అదృశ్యమైన తల్లి గంగాశ్రావణి, కుమార్తె గంగాలత

రంగంపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపూడిలో తల్లి, కూతురు అదృశ్యమయ్యారు. ఏఎస్ఐ వీవీవీ సత్యనారాయణ వివరాల ప్రకారం.. మర్రిపూడికి చెందిన గంగాశ్రావణికి గండేపల్లి మండలం మల్లేపల్లికి చెందిన శ్రీనుతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు.ప్రస్తుతం కుటుంబం అంతా హైదరాబాద్‌లో హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. 20 రోజుల కిందట కుటుంబం అంతా కలిసి శ్రావణి అమ్మ గారింటికి మర్రిపూడి వచ్చారు. ఈ నెల 1న శ్రీను తన సొంతూరు జగ్గంపేట మండలం మల్లేపల్లి వెళ్లాడు. మర్రిపూడి నుంచి వచ్చేసరికి భార్య శ్రావణి, రెండో కుమార్తె గంగా లత(9) ఎక్కడికో వెళ్లిపోయారు. బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. భర్త శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు. తల్లీకూతుళ్ల ఆచూకీ తెలిసిన వారు రంగంపేట ఎస్ఐ 94409 04854, అనపర్తి సీఐ 94407 96538 నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు.

ఆహార పొట్లాలు పంపిణీ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని పుష్కరఘాట్ సమీపంలోని వృద్ధులు, పేదలకు ఆదివారం ఆహార పొట్లాలు, పండ్లు అందజేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, యర్నగూడెం జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ వైస్ సెక్రటరీ మానస, సభ్యురాలు పిల్లి గాయత్రి మాట్లాడుతూ రానున్న రోజుల్లో సేవలను మరింత విస్తరింపజేస్తామన్నారు. కార్యక్రమంలో కోరం ఆంజనేయులు, పెద్దిరాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

61 సీసాలు స్వాధీనం

సీతానగరం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బిల్లంక గ్రామానికి చెందిన వీరమళ్ల శివ నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఏవీవీ సత్యనారాయణ తెలిపారు. బొబ్బిల్లంకలోని తన ఇంటి వద్ద శివ మద్యం అమ్ముతుండగా దాడి చేసి పలు రకాల మద్యం సీసాలు 61 సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.10,630 ఉంటుందని శివపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఆయన తెలిపారు.

మహిళల్లో హైందవ చైతన్యమే ధ్యేయం

విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు శ్రీనివాసరావు



శ్రీరంగపట్నంలో బంగారు వరలక్ష్మి కానుక గెలుచుకున్న మహిళలు

కోరుకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడమే తమ ధ్యేయమని విశ్వహిందు ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివా సరావు అన్నారు. మండలంలోని శ్రీరంగపట్నంలో ఆదివారం ఏర్పాటు చేసిన బంగారు వరలక్ష్మి కానుక-3 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి డ్రాలో గెలుపొందిన 104 మందికి బంగారు వరలక్ష్మి రూపులను అందజేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని 2వేల మంది మహిళలు వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాలలోని 20 వేల మంది బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమంలో పాల్గొనేందుకు రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు. వారిలో రూ.1200 మందిని లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.5 500 విలువైన అరగ్రాము బంగారు వరలక్ష్మి రూపులను కానుకలుగా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, మద్దాల రమణ, బత్తుల నానాజీ, ఉంగరాల మణిరత్నం, కటకం అన్నపూర్ణ, కటకం చలం, రాయిపాటి సత్యనారాయణ, సుంకర శ్రీను, పసల గణేష్, మీసాల నరేష్, బత్తిన వీరాంజనేయులు, పచ్చారి నరసింహమూర్తి, జాజుల నరసింహమూర్తి, చింతల కన్నారావు పాల్గొన్నారు.

సత్యనారాయణరాజు సేవలు అభినందనీయం



సత్యనారాయణరాజును సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ కర్రి రామారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల ఉద్యోగ ప్రయాణంలో సత్యనారాయణరాజు అంకితభావంతో అందించిన సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కాకినాడ పట్టణాభివృద్ధి సంస్థలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ చేసిన చింతలపాటి సత్యనారాయణరాజు అభినందన సభ ఆదివారం జరిగింది.దివాన్‌చెరువులోని శ్రీరాజేశ్వరి కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి సత్యనారాయణరాజు సేవలను గుర్తుచేశారు. వారి శేషజీవితం ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, సీనియర్ జర్నలిస్ట్ వీఎస్ఎస్ కృష్ణకుమార్, రాజమహేంద్రవరం క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు డీబీవీ రాజు, మంతెన కేశవరాజు, మంతెన సత్యనారాయణ రాజు, పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ వత్సవాయి సూరిబాబురాజు, ప్రముఖ వైద్యుడు కర్రి రామారెడ్డి, బైర్రాజు ప్రసాదరాజు, టీడీపీ నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు, ఐవీఆర్ కృష్ణంరాజు, బైర్రాజు సీతారామరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణరాజు దంపతులను ఘనంగా సన్మానించారు.

కూటమి రైతు పక్షపాతి

చాగల్లు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని చిక్కాల సొసైటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షుడిగా యంత్రప్రగడ అబ్బులుచౌదరి,సభ్యులుగా కేతా సత్యనారాయణ, జక్కు గంగరాజు ప్రమాణం స్వీకారం చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ధాన్యం సొమ్ములు సకాలంలో చెల్లించినట్టు చెప్పారు. హామీ మేరకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద నగదు సహాయం అందించామన్నారు. సొసైటీలు మరింత సమర్థవంతంగా పనిచేసేలా నూతన పాలకవర్గం కృషిచేయాలని రైతులకు మరిన్ని సేవలు అందించాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, ఆళ్ల హరిబాబు, చిటికెన పెంటారావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యంగా పనులు : ఎమ్మెల్యే వాసు



శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపట్టామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 9వ డివిజన్‌లోని జేఎన్ రోడ్డు వాకర్స్ రోడ్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆదివారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పర్యాయ పదంగా నిలుస్తోందని, ప్రస్తుతం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులే అందుకు నిదర్శనమన్నారు. నగరాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తామన్నారు. నగర ప్రజల 15 ఏళ్ల కల నెరవేరబోతుందని, గోదావరి బండ్ రివర్ ఫ్రంట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. నగరంలో 35 పార్కులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ



రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు ఆదివారం స్థానిక ఎస్వీజీ మార్కెట్ సమీపంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ పక్కనున్న ఖాళీ స్థలంలోని వ్యర్థాలను తొలగించారు. ప్లాస్టిక్‌ను, కలుపు మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మాగ్నా మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ పర్వతవర్ధిని సత్కరించారు. అనంతరం ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ వెంకటేశ్వర మార్కెట్ నుంచి షెల్టన్ హోటల్ పెట్రోల్ బంక్ మీదుగా సోమాలమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జీవీఎస్ నాగేశ్వరరావు, బీహెచ్ రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదిత్య కళాశాల డైరెక్టర్ గంగిరెడ్డి, జీఎన్‌వీపీడీ మహాలక్ష్మి, ప్రిన్సిపాల్స్ సీహెచ్ ఫణికుమార్, ఎస్కేఎన్ రెహమాన్, డి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సార్ మేడమ్
సూర్యమినీ	: మహావతార్ నరసింహ
సూర్యప్యాలస్	: కింగ్‌డమ్
స్వామి	: హరిహర వీరమల్లు
అనుశ్రీ(సాయికృష్ణ)	: హరిహర వీరమల్లు
శివజ్యోతి	: సార్ మేడమ్
రాజా	: కింగ్‌డమ్
ఊర్వశి	: మహావతార్ నరసింహ
మేనక	: సన్ ఆఫ్ సర్దార్-2
రంభ	: జూనియర్
కుమారి	: ----
అప్సర	: కింగ్‌డమ్
అశోక	: కింగ్‌డమ్
వీఎస్ మహల్(నామవరం)	: కింగ్‌డమ్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: కింగ్‌డమ్
వెంకటసూర్య(కడియం)	: కింగ్‌డమ్
సత్యగౌరి (అనపర్తి)	: మహావతార్ నరసింహ
సూర్యశ్రీ (అనపర్తి)	: హరిహర వీరమల్లు
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: కింగ్‌డమ్
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: కింగ్‌డమ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: మహావతార్ నరసింహ
లలితామహల్(రంపచోడవరం)	: హరిహర వీరమల్లు
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 4 ఆగస్టు 2025 | 5



కాకినాడ జిల్లా క్రీడామైదానం వద్ద ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ కోసం సాఫీగా మారిన రోడ్డు, పక్కన బారికేడ్లు

నేటి నుంచి ఆర్మీ ర్యాలీ

12 జిల్లాల నుంచి 15 వేల మంది కాకినాడ రాక

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి 20వ తేదీ వరకు జరిగే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు 12 జిల్లాల నుంచి అభ్యర్థులు ఈ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొననున్నారు. ఇప్పటికే ఆర్మీ ఎంపిక పరీక్ష రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఇక్కడ దేహదారుఢ్య పరీక్ష, 1.6 కి.మీ రన్, మెడికల్ అండ్ ఫిట్‌నెస్ టెస్టులు, లాంగ్ జంప్, పుల్ అప్స్, నైన్ ఫీట్ డిచ్ అండ్ జిగ్‌జాగ్ ఇలా ఎంపిక ప్రక్రియకు సంబంధించిన అనేక రకాల ఈవెంట్లు జరగనున్నాయి. రోజుకు 600 నుంచి 800 మంది రిక్రూట్‌మెంట్‌లో పాల్గొంటారు. అభ్యర్థులకు ముందుగా నెంబర్లు కేటాయించి, వందమంది చొప్పున 1.6 కి.మీ రన్నింగ్ పరీక్ష, అనంతరం మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు.20 రోజులపాటు జరిగే రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో 15 వేల మంది పాల్గొనే అవకాశం ఉంది. ఆర్మీ అభ్యర్థులకు స్పోర్ట్స్ అథారిటీ ఆవరణలోనే వసతి కల్పించనున్నారు. తొలి రోజు 5వ తేదీ అంటే 4వ తేదీ సోమవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభయ్యే ర్యాలీలో తొలి రోజు 600 మంది పాల్గొననున్నారు. రెండో రోజు ఆరో తేదీ (ఐదో తేదీ అర్ధరాత్రి) మరో 671 మంది, 7,8,9 తేదీల్లో వరుసగా మూడు రోజుల్లో రోజుకు 800 మంది చొప్పున అభ్యర్థులు ర్యాలీలో పాల్గొంటారు. 10వ తేదీన విరామం. 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు రోజుకు 800 మంది పాల్గొంటారు. 15వ తేదీ స్వాతంత్ర్యం దినోత్సవం రోజున సెలవు ప్రకటించారు. 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ జరగనుంది. 20న రెస్ట్ డేతో మొత్తం ఎంపిక ప్రక్రియ పూర్తవుతుంది.

జిల్లాల వారీగా ర్యాలీ షెడ్యూల్ ఇలా..

ఆగస్టు 5వ తేదీ : అల్లూరిజిల్లా, అనకాపల్లి, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్

ఆగస్టు 6, 7, 8 :	అనకాపల్లి
ఆగస్టు 7 :	యానాం
ఆగస్టు 8, 9 :	పార్వతీపురం
ఆగస్టు 9, 11 :	విశాఖపట్నం
ఆగస్టు 11, 12, 13, 14, 16 :	శ్రీకాకుళం
ఆగస్టు 16, 17, 18, 19 :	విజయనగరం
ఆగస్టు 19 :	కాకినాడ జిల్లా

ఆసుపత్రికి వెళితే.. ఇల్లు దోచేశారు! 8

నిడదవోలులో భారీ చోరీ

తల్లీ..ఇద్దరు కుమార్తెల హత్య

సామర్లకోటలో దారుణం



సహకారం!

సొసైటీ పదవుల్లో కూటమి నాయకులకు షాక్

- త్రీమెన్ కమిటీలకు ఝలక్
- సొసైటీల్లో పర్సన్ ఇన్‌చార్జిలు
- గత నెల 30న ముగిసిన గడువు
- మరో ఆరు నెలలు పొడిగింపు
- అయోమయంలో ఆశావహులు

ప్రభుత్వం ఏర్పడేందుకు మేం సహకరించాం.. ప్రభుత్వ సహకారం మాకు ఉంటుంది..అని పలువురు ఆశలు పెట్టుకున్నారు.. జూలై 30న పర్సన్ ఇన్‌చార్జిల పాలన ముగిసింది.. దీంతో త్రీమెన్ కమిటీల్లో ఛాన్స్ దక్కుతుందని ఆశించారు.. అయితే ప్రభుత్వం మాత్రం సొసైటీలపై ఆశలు పెట్టుకున్న నాయకులకు షాక్ ఇచ్చింది. మరో ఆరు నెలలు వారినే కొనసాగిస్తున్నట్టు ఉత్తర్వులు విడుదల చేయడంతో నేతలంతా గరం..గరంగా ఉన్నారు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సొసైటీల్లో పెత్తనం కోసం ఎదురుచూస్తున్న నేతలకు ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. అధికార కూటమిలోని తెలుగుదేశం,జనసేన, బీజేపీ నేతలకు గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం సొసైటీ పాలకవర్గాల్లో ఆయా పార్టీ నేతలను నామినేట్ చేస్తున్న సంగతి తెలిసిందే. గత వైసీపీ పాలనలో వైసీపీ నేతలతో కమిటీలను నియమించింది.తెలుగుదేశం కూటమి అధికా రంలోకి వచ్చాక వాటిని రద్దు చేసి..అఫీషియల్ కమిటీలను నియమించింది. ఇటీవల ఆయా సొసైటీలకు కూటమి నేతలను నామినేట్ చేసే ప్రక్రియ మొదలైంది. కొన్ని సొసైటీలకు ఇప్పటికే త్రీమెన్ కమిటీలను నియమించారు. కానీ ఇంకా పెండింగ్ ఉన్నాయి.

166 సొసైటీలకు ప్రతిపాదనలు

తూర్పుగోదావరి జిల్లాలో 83 సొసైటీలు, కాకి నాడలో 24, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 59 మొత్తం 166 సొసైటీలకు త్రీమెన్ కమిటీలను నియమించాల్సి ఉంది. మూడు జిల్లాల్లో పదవులకు తీవ్ర పోటీ ఉండడంతో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు చర్చించుకుని..అందరికీ నచ్చచెప్పి ఇటీవల ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలు కాస్త ముందుగా వెళ్లి ఉంటే అన్ని సొసైటీలకు త్రీమెన్ కమిటీలు ఈ పాటికే నియామకం పూర్తయ్యేది.ప్రస్తుతం ఆయా నియోజకవర్గాల నుంచి వెళ్లిన ప్రతి పాదనలు పార్టీ అధిష్ఠానానికి చేరాయి. అక్కడ పెద్దలు కూర్చుని మళ్లీ చర్చించే అవకాశం ఉంది.ఈ సభ్యుల వివరాలు కోరుతూ ఆయా జిల్లాలో సహకార శాఖ అధికారులకు జాబి తాలు వస్తాయి.వాటిని పరిశీలించి..ఆయా సొసైటీల ద్వారా సొసైటీ సభ్యులుగా అర్హులేనా అనే సమాచారం సేకరిస్తారు.ఫైనాన్స్, ఎరువుల వ్యా పారం చేస్తున్నా, సొసైటీల్లో బకాయిలు ఉన్నా, సొసైటీలోని ఉద్యోగులకు ఎవరైనా బంధువులై ఉన్నా వారు అనర్హుల వుతారు. ఇటువంటి జాబితాలు ఇంకా సహకార శాఖ అధికారులకు చేరలేదు. కానీ ప్రస్తుతం ప్రతిపాదనల్లో ఉన్న కమిటీలను ఎప్పుడో నియమిస్తే అప్పటి నుంచి త్రీమెన్ కమిటీలు అధికారంలోకి వస్తాయి. వారు వచ్చే జనవరి 30వ తేదీ వరకూ అధికారంలో ఉంటారు. అప్పటి లోపు ఎన్నికలు జరిగితే కొత్త పాలకవర్గాలు వస్తాయి. ఎన్నికలు జరగకపోతే మరో ఆరు నెలల పాటు త్రీమెన్ కమిటీలే కొనసాగుతాయి. ప్రస్తుతం ప్రతిపాదనలన్నీ కొద్ది రోజులు ముందుగా వెళ్లి ఉంటే ఇవాళ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలను కొనసాగించే అవసరం లేకపోయేది. ఒక్కో సొసైటీకి ముగ్గురు వంతున నియామకం వల్ల వందలాది మంది పార్టీనేతలకు పదవులు వచ్చేవి.కానీ ప్రస్తుతం కొంత వెయిటింగ్ తప్పదు.

173 సొసైటీలకు పాతవారే..



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొద్ది రోజుల కిందట సుమారు 173 సొసైటీ లకు త్రీమెన్ కమి టీలను నియమించారు. అందులో ఒకరు చైర్ పర్సన్, ఇద్దరు డైరెక్టర్లు ఉంటారు. గతజూలై 30కి పాత పాలకవర్గాల గడువు ముగియడంతో మరో ఆరు నెలల పాటు పొడి గిస్తూ ప్రభుత్వం జీవో ఇచ్చింది.ఇప్పటికే త్రీ మెన్ కమిటీల నియామకమైన సొసైటీల్లో వారే కొన సాగుతారు.కమిటీలు లేని చోట పర్సన్ ఇన్‌చార్జి కొనసాగుతారు.2013లో సొసైటీలకు ఎన్నికలు జరిగాయి. తర్వాత వాటికి ఎన్నికలు నిర్వ హించలేదు. అప్పటి నుంచి కమిటీలను నియ మిస్తూ నెట్టుకొస్తున్నారు.



రెడీఎస్సీ!

15లోపు మెగా డీఎస్సీ ఫలితాలు

- ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ
- అభ్యర్థుల ఎదురుచూపులు
- ఉమ్మడి జిల్లా పోస్టులు 1241
- పరీక్షకు 38,617 మంది హాజరు
- ఒక్కో పోస్టుకు 50 మంది పోటీ
- 16 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన
- నెలాఖరుకు టీచర్లకు శిక్షణ
- కల నెరవేర్చిన కూటమి ప్రభుత్వం
- గత వైసీపీ ఐదేళ్లు మాటలే
- మరో హామీ నెరవేర్చినట్టే

లక్షలాది మంది నిరుద్యోగులకు టీచర్ ఉద్యోగం ఒక కల..గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వంలో ఊరించి ఉసూరుమనిపించి ఆ కలకు బ్రేకులు వేసింది..అయితే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే డీఎస్సీ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు.. అన్నట్టుగానే నోటిఫికేషన్ విడుదల చేశారు.. పరీక్షలు నిర్వహించారు.. మరో 13 రోజుల్లో ఫలితాలు విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు.. ఈ నేపథ్యంలో అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.. అప్పుడే ఫలితాలకు ఎదురుచూపులు ఆరంభమయ్యాయి.. 1241 పోస్టులకు 60 వేల మంది క్యూలో ఉన్నారు.. ఎవరిని అదృష్టం వరిస్తుందో చూడాలి..

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం వచ్చింది..యువత కల తీరుస్తోంది..ఎన్నేళ్ల కలలనో తీరుస్తోంది. ప్రభుత్వ కొలువులు ప్రకటనలు విడుదల చేస్తూ అభ్యర్థుల ఎంపిక చేపడుతోంది. దీనిలో భాగంగానే గురువారం పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలను విడుదల చేసిన కూటమి సర్కారు డీఎస్సీ అభ్యర్థులకు తీపి కబురు చెప్పింది. ఫలితాల కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్న వారికి శుభవార్త వినిపించింది. ఈ నెల ఒకటో తేదీనకీ విడుదల చేసిన విద్యాశాఖ ఈ నెల 15లోపు మెగా డీఎస్సీ-2025 ఫలితాలను విడుదల చేస్తామని విద్యాశాఖ ప్రకటించింది. దీంతో డీఎస్సీ అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే కీ పరిశీలనతో ఓ నిర్ణయానికి వచ్చిన అభ్యర్థులు ఫలితాలకు ఎదురుచూస్తున్నారు. 16 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన,నెలాఖరుకు కొత్త టీచర్ల పోస్టింగ్‌లు, శిక్షణ అన్నీ చకచకా జరగనున్నాయి.

63,004 దరఖాస్తులు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా డీఎస్సీకి ఎక్కువ మంది దరఖాస్తు చేశారు. అన్ని మేనేజ్‌మెంట్లకు కలిపి 1241 పోస్టులు ఉండగా63,004 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో పోస్టుకు సగటున 50 దరఖాస్తులు రావడంతో అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అయితే ఈ సారి పురుషుల కన్నా మహిళలే దరఖాస్తు నమోదు లో ముందున్నారు.కేటగిరీల వారీగా ఓసీ-5120, బీసీ-ఏ 2810, బీసీ-బీ 6991, బీసీ-సీ 554, బీసీ-డి 3636, బీసీ-ఈ 568, ఎస్సీ గ్రేడ్-1 87, ఎస్సీ గ్రేడ్-2 2572, ఎస్సీ గ్రేడ్-3 10,066,ఎస్టీ 6,213, ఈడబ్ల్యూఎస్ 3,782,దివ్యాంగుల కేటగిరీ నుంచి వీహెచ్ 159, హెచ్‌హెచ్ 36, ఓహెచ్ 847, ఎంఐ ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు.

1241 ఉపాధ్యాయ పోస్టులు

ఉమ్మడి జిల్లాలో 1241 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్ 608, పీఈటీలు 210, ఎస్జీటీ 423 పోస్టులు ఉన్నాయి.స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తెలుగు 65, హిందీ 78,ఆంగ్లం 95, గణితం 64, ఫిజికల్ సైన్స్ 71, బయోలాజికల్ సైన్స్ 103, సో షల్ 132, వ్యాయామవిద్య 210 ఉద్యోగాలతో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ల ఉద్యోగాలు ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమానికి సంబంధించి ఫిజికల్ సైన్స్ 3, బయోలాజికల్ సైన్స్ 4, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య 1, ఎస్జీటీలు 104 మొత్తం 112 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ప్రత్యేక విద్యకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 13 టీజీటీలు, 3 పీఈటీలు, 15 ఎస్జీటీలతో కలిపి 31 పోస్టులు ఉన్నాయి. జోన్-2 (ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా)కు సంబంధించి ఏపీఆర్ఎస్, ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూ, బీసీ, సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీఈటీ 24తో కలిపి మొత్తం 348 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు.

నాడు ఊరించి.. ఉసూరుమనిపించి..

గత వైసీపీ సర్కారు నిరుద్యోగులను నట్టేట ముంచింది. ఉద్యోగాల పేరుతో ఊరించి ఆ ఐదే ళ్లూ ఉసూరుమనిపించింది. ముఖ్యంగా మెగా డీఎస్సీ అంటూ దగా చేసింది. ఆ ఐదేళ్లు ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదు. దీంతో ఎంతో మంది అభ్యర్థులు తీవ్ర నిరాశకు గురయ్యారు.ఆ ప్రభావం వైసీపీ ఓటమిపైనా పడింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే..ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ ప్రకటించింది.ఈ నెలాఖరుకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీని పూర్తి చేయనుంది.



వయసులు అరవై.. మనసులు ఇరవై!


అరెయ్ ఎలా ఉన్నావ్‌రా! ఒరెయ్ బాగున్నావా.. ఏమేవ్ ఏం చేస్తున్నావ్! ఈ మాటలు వింటుంటే ఎవరో పాఠశాల విద్యార్థులు మాట్లాడుకున్నట్టు ఉంది కదూ.. అవును నిజమే వాళ్లు విద్యార్థులే కానీ వయసు 20 కాదు..60 ఏళ్లు పైనే.. ఎందుకంటే వాళ్లు పూర్వ విద్యార్థులు.. రాజమహేంద్రవరం ప్రకాశంనగర్ సెంటినరీ మునిసిపల్ హైస్కూల్‌లో 1974-1977లో 8,9,10 తరగతులు చదువుకున్నారు.. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం వారంతా గౌతమి ఘాట్‌లోని రివర్ బేలో కలుకుని 50 ఏళ్ల తమ స్నేహానికి గుర్తుగా పండుగ చేసుకున్నారు. స్నేహానికి వయసుతో పనేముంది.. ఎన్నేళ్లయినా.. ఎంత వయసొచ్చినా..స్నేహం చెక్కు చెదరదనడానికి ఈ సంఘటనే నిదర్శనంగా చెప్పుకోవచ్చు..

- రాజమహేంద్రవరం కల్చరల్

సిమ్ ఒక రూపాయి.. వ్యాలిడిటీ 30డేస్

ప్రస్తుతం ఏ నెట్ వర్క్ అయినా నెల రోజులు వ్యాలిడిటీ ప్లాన్‌కు రూ.200ల పైనే వసూలు చేస్తున్నాయి.. ఒక రూపాయికే సిమ్ కార్డ్ ఇచ్చి.. 30 రోజుల వ్యాలిడిటీ, అపరిమిత కాలింగ్, రోజుకి 2జీబీ డేటా, రోజుకు 100 మెసేజ్‌లు ఆఫర్ చేస్తే అదిరిపోద్ది కదా.. అయితే మీకు ఆ ఆఫర్ అందుబాటులోనే ఉంది. ఈ మేరకు ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ సరికొత్త ఫ్రీడం ప్లాన్ ప్రవేశపెట్టింది. ఎంఎన్‌పీ వినియోగదారులకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని బీఎస్ఎన్ఎల్ రాజమహేంద్రవరం బిజినెస్ ఏరియా ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ పలివెల రాజు తెలిపారు. ఇంకెందుకు ఆలస్యం రూపాయి తీసుకెళదాం.. సిమ్ తెచ్చుకుందాం..సిమ్ కార్డుకు బీఎస్ఎన్ఎల్ సేవాకేంద్రాన్ని సం ప్రదించాలని సూచించారు.

- రాజమహేంద్రవరం కల్చరల్



ఉరుకుల్లేవ్.. పరుగుల్లేవ్..

ధవళేశ్వరం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా తగ్గుముఖం పడుతున్న గోదావరి ఆదివారం నాటికి మరింత తగ్గుముఖం పట్టింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి ఆదివారం సాయంత్రానికి 2,57,545 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.దీంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 5 వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2300 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7000 క్యూసెక్కుల చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.



ఫైర్.. నో సేఫ్టీ!

- ప్రమాదంలో విపత్తుల నిర్వహణ శాఖ
- వెన్నాడుతున్న సిబ్బంది కొరత
- ఆఫీసు పనులకు కేటాయింపు నిల్
- తూర్పులో రెస్క్యూ బోటుకు చిల్లు
- మూడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి

ఫైర్ సిబ్బంది పనితనం ఎప్పుడు తెలుస్తుం ది.. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వారు హుటాహుటిన చేరుకుని ప్రమాదాన్ని అదుపులోకి తెచ్చినప్పుడే కదా..ప్రమాదం జరిగిన ప్పుడు విపత్తుల నిర్వహణ శాఖ అందుబాటులో లేకపోతే ఎలా? ప్రమాదాలను ఏమి అదుపు చేస్తారు.. ఎవరిని రక్షిస్తారు.. రాజమహేంద్రవరంలో శుక్రవారం ఎదురైన సంఘటనే అందుకు నిదర్శనం. ఫైర్‌స్టేషన్‌కు 2 అడుగుల దూరంలో ప్రమాదం జరిగినా ఫైర్ సిబ్బంది చేరుకోవడా నికి 45 నిమిషాలు పట్టింది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

విపత్తు సంభవించినప్పుడు ప్రతి సారీ ట్యాంకులో నీళ్లు నింపుకొని వెళ్తే పని జరగదు. విపత్తు నిర్వహణకు మానవ వనరులు, ఇతర పనిముట్లు లేకుండా చేసేదేమీ ఉండదు. ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భాల్లో ఎంత త్వరగా ఘటనా ప్రదేశానికి చేరుకుంటారనే అంశంపైనే నష్ట నివారణ ఆధారపడి ఉంటుంది. కానీ అగ్నిమాపకశాఖను కొరతలు వేధిస్తుండడంతో కాగితాల్లో లెక్కలకు వాస్తవ పరిస్థితికి వ్యత్యాసం ఉంటోంది. రెస్క్యూ పరికరాలు మరమ్మతుల్లో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. సగం సిబ్బందితోనే ఇబ్బందులు పడుతూ నెట్టుకొస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఒక షూమార్ట్‌లో శుక్రవారం ఉదయం ఫైర్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ప్రమాదం జరిగినా చేరుకోవడానికి 45 నిమిషాలు సమయం పట్టిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలి. జూన్ 4న గోదావరి లంక నుంచి నాటు పడవలో చీకటి పడిన వేళ వస్తూ ప్రమాదానికి గురై ఇద్దరు మృత్యువాత పడ్డారు.సమాచారం అందిన వెంటనే ఫైర్ ఇంజనుతో అగ్నిమాపక సిబ్బంది పుష్కరాల రేవుకు చేరుకున్నారు. తక్షణమే రంగంలోకి దిగాల్సి ఉన్నా దిగాలుగా నిలబడడం తప్పలేదు. ఎందుకంటే అందుబాటులో ఉన్న ఒక్క రెస్క్యూ బోట్‌కి చిల్లు పడిందని తెలిసింది. దీంతో గాలింపునకు నాటు పడవలే దిక్కయ్యాయి.దీంతో 4 గంటల క్లిష్టమైన సమయం గడిచిపోయింది. ఇటువంటి ఘటనలు అగ్నికి ఆజ్యంగా మారుతున్నాయి. 7 జిల్లాలకు సంబంధించి జోన్-2 ప్రాంతీయ ఫైర్ అధికారి రాజమండ్రిలోనే ఉన్నా పూర్తి స్థాయిలో విపత్తు నిర్వహణ కానరావడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి.తూర్పుగోదావరి, కాకినాడ,అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని విపత్తు నిర్వహణ శాఖ తిప్పల పై 'ఆంధ్రజ్యోతి' కథనం

సిబ్బంది కొరత

విపత్తు నిర్వహణ శాఖలో సిబ్బంది కొరత అంతర్గత విపత్తులా మారింది. సిబ్బంది సరిపడా లేకపోవడం వల్ల అందుబాటులో ఉన్న సిబ్బందిపైనే భారం పడుతోంది. అత్యవసర సర్వీసు కాబట్టి డ్యూటీల్లో వెసులుబాట్లు ఉండడంలేదు. దీంతో ఉద్యోగులు అనారోగ్యాల బారిన పడుతుండగా.. కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. ఎగ్జిక్యూటివ్ స్టాఫ్ కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో 150 వరకూ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏవో, జేఏవో,సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్ట్, ఆఫీస్ సబార్డినేట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు కార్యాలయ నిర్వహణకు అవసరం. వీరిని మినిస్టీరియల్ సిబ్బంది అంటారు. అయితే మూడు జిల్లాలకు ఇద్దరేసి చొప్పున జూనియర్ అసిస్టెంట్ల పోస్టులు మాత్రమే కేటాయింపు ఉంది. కోనసీమ, తూర్పు గోదా వరిలో వారూ లేరు.అధికారులే లెటర్ టైప్ చేసుకొని ప్రింట్ తీసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

వాణిజ్య ప్రాంతాల్లో భయం..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వాణిజ్య కేంద్రంగా రాజమహేంద్రవరం ఉంది. గృహోపకరణాల దగ్గర నుంచీ అన్నీ లభ్యమవుతాయి. సుమారు 2 వేలకుపైగా దుకాణాల్లో రోజూ కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. ప్రధానంగా దుకాణాలన్నీ పెద్ద బజారు, గోదావరి గట్టును ఆనుకొని ఉన్న ప్రాంతంలో ఉన్నాయి. అధిక శాతం షాపుల్లో కనీస అగ్నిమాపక సామగ్రి ఉండదు. ఫైర్ సేఫ్టీ ఉండదు.షాపుల మధ్య కనీస దూరం ఉండదు. కొన్ని సందుల్లోకి బైక్ కూడా వెళ్లని పరిస్థితి ఉంది. ఏదైనా జరగరానిది జరిగితే ఫైర్ బుల్లెట్లు వెళ్లలేని దుస్థితి. దుకాణాల్లోని ఫ్లోర్‌లను లేదా గదులను గోదాములుగా ఉపయోగిస్తుంటారు. కానీ ఫైర్ సేఫ్టీ ఉండదు. మోచీ వీధి,పెద్ద బజారు, నల్ల మందు సందు ఇలా ఇక్కడ చాలా వాణిజ్య ప్రదేశాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో అర్ధ రాత్రి వేళ ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే అంతే. ప్రాణాలతో బయట పడడం కష్టమే. ఎక్కువ శాతం పాత భవనాలు ఉండడంతో ఎలక్ట్రికల్ వైరింగ్ ఏనాటిదో ఉంది. ఇవన్నీ పట్టించుకోవడానికి యంత్రాంగానికి సమయం లేదు. మూడు జిల్లాల్లోని వాణిజ్య ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి అగ్నిమాపక చర్యలు తీసుకోవాలనే వాదన బలంగా వినబడుతోంది.

పనిముట్ల పరిస్థితీ అంతే

విపత్తు వేళ సిబ్బంది ఎంత సామర్థ్యం కలిగిన వారు ఉన్నా పనిముట్లు, పరికరాలు లేకపోతే సమయం వృథా తప్పదు. కళ్ల ముందే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. మూడు జిల్లాలోని రెస్క్యూ ఎక్విప్‌మెంట్ పూర్తి స్థాయిలో మనుగడలో లేదు.కొన్ని మరమ్మతులో ఉండగా, మరికొన్ని మూలకు చేరిపోయాయి.పలు స్టేషన్లలో అన్నీ ఉన్నా సరిపడా సిబ్బంది లేరు. గోదావరికి వరదల సమయంలో జనాన్ని, పశువులను రక్షించడానికి కూడా నాటు పడవలే గత్యంతరం. తూర్పుగోదావరిలో విస్తార గోదావరి తీరం ఉంది.ప్రతి ఏడాదీ వరదలు సహజమే. ఈ నాటికీ ఒక్క రెస్క్యూ బోటు కూడా సమకూర్చుకోలేని దైన్యంలో విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ కొట్టుమిట్టాడుతోంది.

ధారవరం రైల్వే గేటు తెరిచారు

చాగల్లు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధారవరం రైల్వే గేటును ఆదివారం తిరిగి తెరిచారు. రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా వారం రోజులు పాటు గేటు మూసివేయడంతో ఆయా గ్రామాల ప్రజలు నిడదవోలు మెయిన్‌రోడ్డు నుంచి ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తిరిగి గేటు తెరవడంతో రైతులు సహా అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చిట్టడవులు

● పట్టణంలో పలుచోట్ల ఖాళీ జాగాలు

● విష పురుగులకు ఆవాసాలుగా మారుతున్న వైనం

● పట్టించుకోని అధికారులు



12వ వార్డులో ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు

కొవ్వూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలుచోట్ల ఖాళీ జాగాలు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తూ చిట్టడవులను తలపిస్తున్నాయి. దీంతో విషపురుగులకు ఆవాసంగా మారుతోంది. అయితే ప్రతి ఏడాది ఆస్తిపన్ను వసూలులో శ్రద్ధ కనబరుస్తున్న అధికారులు పిచ్చిమొక్కలు తొలగించడంలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారోనని ప్రజలు బాహాటంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రధానంగా పట్టణంలోని 23 వార్డులలో దశాబ్దాలుగా రూ. కోట్ల విలువైన స్థలాలు ఖాళీగా ఉన్నాయి. చుట్టుపక్కల భవనాలు నిర్మించడంతో వాటిల్లోకి వర్షపునీరు చేరుతుండడం వల్ల పిచ్చిమొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. మురుగు రోజుల తరబడి నిల్వ ఉండడంతో రంగుమారి దుర్వాసన వెదజల్లుతోంది. దీనికితోడు చుట్టుపక్కల ఇళ్ల నుంచి చెత్తాచెదారం తీసుకువచ్చి ఆ ఖాళీ స్థలాల్లో పడవేస్తున్నారు. అలాగే దోమలు బెడద బాగా పెరిగింది. దీంతో చీకటిపడితే చిన్నారులు, వృద్ధులు అవస్థ లు పడుతున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సాక్షాత్తు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని పట్టణంలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లినప్పుడు ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పడం గమనార్హం. డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని, కొన్ని ప్రాంతాలో చెత్త తరలించడం లేదని, ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయి అనారోగ్య సమస్యలకు గురి అవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు అలసత్వాన్ని వీడి క్షేత్రస్థాయిలో పర్యటించి పట్టణంలో ఖాళీస్థలాలల్లో పిచ్చిమొక్కలు తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపర్చడానికి సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



హెడ్ పోస్టాఫీసు భవనం పక్కన చిట్టడవిని తలపిస్తున్న దృశ్యం

రైతుల పక్షపాతి ప్రభుత్వం : ఎమ్మెల్యే



చిక్కాల సొసైటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

చాగల్లు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా పనిచేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం చిక్కాల సొసైటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం జరిగింది. ఇందులో అధ్యక్షుడిగా యంత్రప్రగడ అబ్బులు చౌదరి, సభ్యులుగా కేతా సత్యనారాయణ, జక్కు గంగరాజు ఎన్నికయ్యారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ధాన్యం సొమ్ములు సకాలంలో చెల్లించినట్టు చెప్పారు. అన్నధాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం నగదు సహాయం ఇచ్చిన మాట ప్రకారం చెల్లించడం జరిగిందన్నారు. సొసైటీలు మరింత సమర్థవంతంగా పనిచేసేలా నూతన పాలకవర్గం కృషిచేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, మాజీ సర్పంచ్ చిటికెన పెంటారావు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కంప్యూటర్, టీవీ బహూకరణ



కంప్యూటర్, టీవీను ప్రారంభిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ముదయ్య

తాళ్లపూడి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూడి శాఖా గ్రంథాలయానికి బెంగుళూరుకు చెందిన శివ శ్రీ చారిటబుల్ ట్రస్టు అండ్ ఫౌండేషన్ సభ్యులు రెండు కంప్యూటర్లు, ఒక స్మార్ట్ టీవీ, స్మార్ట్‌ఫోన్‌ను ఆదివారం బహూకరించారు. వీటిని జిల్లా మాస్టర్ ట్రైనర్ డీ. సత్యనారాయణ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి నరేష్ మాట్లాడుతూ డిజిటల్ లైబ్రరీని ప్రోత్సహించేందుకు శివశ్రీ ఫౌండేషన్ సంస్థ కర్ణాటక రాష్ట్రంలో 5000 గ్రామాల్లోని గ్రంథాలయాలకు కంప్యూటర్‌లు, స్మార్ట్ టీవీ, స్మార్ట్‌ఫోన్లను అందించిందన్నారు.

సమాజ సేవే 'మానవత' సేవా సంస్థ లక్ష్యం



ఎమ్మెల్యే సమక్షంలో నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న రామచంద్రారెడ్డి

నల్లజర్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా సమాజ సేవ చేయడమే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎన్. రామచంద్రా రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక స్టార్ గ్రాండ్ కల్యాణ మండపంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. దీనిలో భాగంగా నూతన కార్యవర్గ సభ్యులతో రామచంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా నల్లజర్లకు చెందిన కండెపు వెంకట సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా వాశిబోయిన చంద్రయ్య, కార్యదర్శిగా భోగవల్లి వెంకట సుబ్బారావు, కోశాధికారిగా పుప్పాల గోపి దుర్గా రాజేంద్రప్రసాద్, సభ్యులు ప్రమాణం చేసిన వారిలో ఉన్నారు. మండలాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి ప్రత్తిపాటి రాంబాబు, దేవినేని భాస్కరరావు, రామాంజనేయుల రెడ్డి, నందం రాజేంద్రప్రసాద్, గుళ్లపూడి వెంకటరత్నం, ఐడీవీ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో హైందవ చైతన్యమే లక్ష్యం

విశ్వహిందు ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు శ్రీనివాసరావు



శ్రీరంగపట్నంలో బంగారు వరలక్ష్మి కానుక గెలుచుకున్న మహిళలు

కోరుకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావడమే తమ లక్ష్యమని విశ్వహిందు ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శ్రీరంగపట్నంలో ఆదివారం ఏర్పాటు చేసిన బంగారు వరలక్ష్మి కానుక-3 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి డ్రాలో గెలుపొందిన 104 మందికి బంగారు వరలక్ష్మి రూపులను అందజేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని 2వేల మంది మహిళలు వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాలలోని 20 వేల మంది బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమంలో పాల్గొనేందుకు రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు. వారిలో రూ.1200 మందిని లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.5500 విలువైన అరగ్రాము బంగారు వరలక్ష్మి రూపులను కానుకలుగా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల పెద అమ్మాజీ, మద్దాల రమణ, బత్తుల నానాజీ, ఉంగరాల మణిరత్నం, కటకం అన్నపూర్ణ, కటకం చలం, రాయిపాటి సత్యనారాయణ, సుంకర శ్రీను, పసల గణేష్, మీసాల నరేష్, బత్తిన వీరాంజనేయులు, పచ్చారి నరసింహమూర్తి, జాజుల నరసింహమూర్తి, చింతల కన్నారావు పాల్గొన్నారు.

మర్రిపూడిలో తల్లీ కూతుళ్ల అదృశ్యం

● పోలీసుల గాలింపు చర్యలు

రంగంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మర్రిపూడిలో తల్లీ, కూతురు అదృశ్యమయ్యారు. ఏఎస్ఐ వీవీవీ సత్యనారాయణ వివరాల ప్రకారం.. మర్రిపూడికి చెందిన గంగాశ్రావణికి గండేపల్లి మండలం మల్లేపల్లికి చెందిన శ్రీనుతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలున్నారు. వీరంతా ప్రస్తుతం హైదరాబాద్‌లో హోటల్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 20 రోజుల క్రితం వారంతా శ్రావణి అమ్మగారింటికి మర్రిపూడి వచ్చారు. ఈ నెల 1న శ్రీను తన సొంతూరు మల్లేపల్లి వెళ్లాడు. తిరిగి మర్రిపూడి వచ్చేసరికి భార్య శ్రావణి, 9 సంవత్సరాల వయసున్న రెండో కుమార్తె గంగాలత కలిసి ఎక్కడికో వెళ్లిపోయారని, బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియరాలేదు. భర్త శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు రంగంపేట ఎస్.ఐ 94409 04854, అనపర్తి సీఐ 94407 96538 నెంబర్లకు ఫోన్ చేసి తెలపాలని ఆయన కోరారు.

సామర్లకోటలో దారుణం

● తల్లీ, ఇద్దరు కుమార్తెల హత్య

సామర్లకోట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో ఆదివారం దారుణమైన సంఘటన జరిగింది. పట్టణంలోని సీతారామ కాలనీలో ఒక ఇంట్లోని తల్లి, ఇద్దరు కుమార్తెలు దారుణ హత్యకు గురయ్యారు. కుమార్తెల్లో ఒకరికి ఎనిమిదేళ్లు కాగా మరొకరికి ఆరేళ్లు కావడం విచారకరం. రోజూలాగే లారీ డ్రైవర్‌గా విధులకు వెళ్లిన వ్యక్తి ఉదయం ఇంటికి వచ్చిన చూడగా తన భార్య, కూతుళ్లు విగత జీవులుగా రక్తపుమడుగులో పడి ఉండ డాన్ని చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యాడు.

అసలేం జరిగింది?

వివరాల్లోకి వెళితే సామర్లకోట బ్రౌన్‌పేటకు చెందిన లారీ డ్రైవర్ ములపర్తి ప్రసాద్‌కు కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామానికి చెందిన మాధురి(26)తో పదేళ్ల క్రితం వివాహం అయ్యింది. వారికి కుమార్తెలు ములపర్తి పుష్పకుమారి (8), జెస్సీలోవ(6) ఉన్నారు. ఈ కుటుంబం గత కొంతకాలంగా బ్రౌన్‌పేటకు సమీపాన గల సీతారామకాలనీలో నివాసం ఉంటున్నారు. ప్రసాద్ ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన వాహనంపై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజూ లాగే శనివారం రాత్రి విధులకు వెళ్లి తిరిగి ఆదివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఎంతకూ తలుపులు తీయకపోవడంతో వెనక తలుపులు తొలగించి లోపలికి వెళ్లగా గదిలో భార్య, కుమార్తెలు విగతజీవులుగా రక్తపు మడుగులో ఉండడాన్ని చూసి షాక్ తిన్నాడు. దీంతో సామర్లకోట పోలీసులకు సమాచారం అందించాడు. సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మరోపక్క కాకినాడకు చెందిన క్లూస్ టీంబృందాలు సంఘటనా స్థలిలో వేలిముద్రలను సేకరిం చడంతో పాటు పోలీసు జాగిలాలను వదిలారు. ముగ్గురినీ తలపై బలమైన ఆయుధంతో గట్టిగా కొట్టి హతమార్చినట్టు పోలీసులు ప్రాథమికంగా భావించారు.

పోలీసు బృందాల గాలింపు : ఎస్పీ

కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ హుటాహుటిన సామర్లకోట చేరుకుని సంఘటనకు దారితీసిన పరిస్థితులపై సామర్లకోట పోలీసు అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకర్లతో ఎస్పీ మాట్లాడుతూ హత్య చేసినవారిని తక్షణం అరెస్ట్ చేసేందుకు పోలీసు బృందాలు గాలింపు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఎస్పీ వెంట పాల్గొన్నారు ఉన్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురు దారుణ హత్యకు గురి కావడంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.

జాతీయ స్థాయి పోటీలకు సాకేత్ ఎంపిక



బ్యాడ్మింటన్ పోటీల్లో రన్నర్‌గా నిలిచిన సాకేత్

తాళ్లపూడి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్ - 14 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రక్కిలంకకి చెందిన సుంకర గంగరాజు కుమారుడు సుంకర సాకేత్ సాస్తా ఎంపికయ్యాడని జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ నాగులకొండ వీరభద్రం తెలిపారు. కాగా సికింద్రాబాద్‌లో ఇటీవల జరిగిన ఆంధ్రా, తెలంగాణ ఐసీఎస్‌సీ అండర్ - 14 స్కూల్ గేమ్స్‌లో సాకేత్ రన్నర్‌గా నిలిచాడన్నారు. ఈయన సెప్టెంబర్ 24, 25 తేదీల్లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈసందర్భంగా గ్రామంలోని పలువురు నాయకులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

డిసెంబర్ 31 వరకు గడువు పొడిగింపు

కొవ్వూరు, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకునేందుకు డిసెంబర్ 31 వరకు గడువు పొడిగించినట్టు విద్యుత్‌శాఖ నిడదవోలు డివిజన్ ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. గడువులోగా చేసుకుంటే ఫీజులో 50 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం



నిడదవోలు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత నేత్ర వైద్యశిబిరం

నిడదవోలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆధ్వర్యంలో ఆదివారం వాకర్స్ క్లబ్, వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. జాగృతి నేత్ర వైద్యశాల వైద్య సిబ్బందిచే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 50 మందికి రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహ కారంతో కళ్లజోళ్లను అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బీ. రాజారామ్ మోహన్‌రాయ్, కార్యదర్శి దారపురెడ్డి శ్రీరామప్రతాప్, ట్రెజరర్ గొల్లకూటి రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ ఢీకొని న్యాయవాదికి గాయాలు

కొవ్వూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్ ఢీకొని న్యాయవాది గాయపడినట్టు పట్టణ సీఐ పీ. విశ్వం తెలిపారు. తాళ్లపూడికి చెందిన న్యాయవాది బజ్జానికి ప్రసాదరావు ఈనెల 2వ తేదీన ఉదయం 11 గంటలకు కొవ్వూరు రోటరీ క్లబ్‌లో జరిగిన సమావేశానికి హాజరై... తిరిగి ఇంటికి వస్తుండగా ఆరికిరేవుల అమ్మవారి ఆలయం వద్ద మోటార్ సైకిల్ ఢీకొట్టింది. దీంతో ప్రసాదరావుకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కొవ్వూరు, అక్కడ నుంచి రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసులు తెలిపారు.

మహాలక్ష్మమ్మ ఆలయ శిఖర పునః ప్రతిష్ఠ

అనపర్తి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని శాంతిపురంలో శ్రీ గణపతి సరస్వతి సహిత మహాలక్ష్మి అమ్మవారి ఆలయ శిఖర పునః ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన కొవ్వూరి సతీష్‌రెడ్డి పూర్ణ గౌతమి దంపతుల చేతుల మీదుగా ఆలయార్చకులు, వేద పండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోట సత్తెమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని అలంకరించిన దృశ్యం

నిడదవోలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోట సత్తెమ్మ వారి దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభించి, ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్ర నామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర , మహా నివేదన పూజలు గావించారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు ఉచిత, ప్రత్యేక దర్శనాల ద్వారా దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అమ్మవారి దర్శనం కలగజేశారు.

మాజీ ఎంపీటీసీ 'కండెపు'నకు మాతృవియోగం



సోమమ్మ భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, నల్లజర్ల మాజీ ఎంపీటీసీ కండెపు వెంకటరత్నంకు మాతృవియోగం కలిగింది. శతాధిక వృద్ధురాలు కండెపు సోమమ్మ (101) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఆమె పార్థివదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈమెకు ఐదుగురు కుమారులు, 30 మంది మనవళ్లు మనవరాళ్లు ఉన్నారు. అంత్యక్రియలను నల్లజర్ల శ్మశానవాటికలో నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, టీడీపీ సీనియర్ నాయకుడు వల్లూరి సత్తిపండు, చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకట రమణ, షేక్ మీరా సాహెబ్, నిమ్మలపూడి వరప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు బేతిన దుర్గారావు, కండెపు సుబ్రహ్మణ్యం, వైసీపీ నాయకులు కండెపు రామకృష్ణ, మేణ్ని యువరాజు, పల్లి సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

అపూర్వ విద్యార్థుల సమ్మేళనం



2000-2001లో పదోతరగతి చదివిన విద్యార్థులు

కొవ్వూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ పాఠశాలలో 2000 - 2001లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఒక్కచోట కలుసుకున్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 25 సంవత్సరాల తరువాత ఒకరికొకరు కలుసుకుని ఫ్రెండ్ షిప్ డే శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీనిలో భాగంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం విందును స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పిక్కి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు పట్టణంలో భారీ చోరీ



సంజీవయ్య నగర్‌లో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ దేవకుమార్

నిడదవోలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంజీవయ్య నగర్ (బుక్కాపేట)లో నివాసముంటున్న మనుబోలు వెంకటేశ్వర రావు ఇంట్లో దొంగలు పడ్డారు. ఇందులో బంగారం, వెండి, నగదు దోచుకుపోయారు. ఈ సంఘటన శనివారం రాత్రి బయటపడింది. గతవారం రోజులుగా ఆ ఇంటి కుటుంబ యజమానికి ఆరోగ్యం బాగుండకపోవడంతో చికిత్స నిమిత్తం విజయవాడలో ఉంటున్నారు. అయితే శనివారం రాత్రి ఆ కుటుంబం ఇంటికి చేరుకున్న సమయంలో ఇంట్లో దొంగలు పడిన ట్టు గుర్తించారు. దీనిపై మనుబోలు గౌతమి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుమారు 20 కాసుల బంగారం, వెండి, నగదు చోరీకి గురైనట్టు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, సీసీఎస్ క్రైం సీఐ శ్రీధర్ కుమార్, తదితరులు పరిశీలించారు. వేలిముద్రల నిపుణులు వచ్చి ఇంటి తలుపులపై ఉన్న నమూనాలను సైతం సేకరించారు. పట్టణ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం



చాగల్లులో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

చాగల్లు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ నూతన కార్యవర్గం అంకితభావం, సేవాభావం కలిగి పనిచేయాలన్నారు. నూతన కార్యవర్గ సంఘం అధ్యక్షుడిగా పెంజర్ల ఉమ్మాజీ, కార్యదర్శిగా చిక్కాల శ్రీనివాస్, కోశాధికారిగా నారాయణ సత్యనారాయణ (ఊనగట్ల)తో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గ్రంధి రాంబాబు, రాష్ట్ర మహాసభ సభ్యుడు చీమకుర్తి ప్రహరీ, జిల్లా నాయకుడు సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సహాయకుల పునర్నియామకంలో సుప్రీంకోర్టు తీరు ఆశాజనకం

ఏపీ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ప్రసాద్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడిన వైద్య, ఆరోగ్యశాఖ ఆరోగ్య సహాయకుల పునర్నియామకం విషయంలో సుప్రీంకోర్టు స్పందించిన తీరు ఆశాజనకంగా ఉందని ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎన్నో ఏళ్ల నుంచి వైద్యసహాయకులుగా పనిచేస్తున్న వారిని ఒక్కసారిగా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. సుప్రీం కోర్టు చేసిన సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ వ్యవహారాన్ని చక్కదిద్దే ఆలోచన చేస్తుందనే ఆశ కలుగుతోందన్నారు. చిరుద్యోగులైన ఆరోగ్యసహాయకుల విషయంలో ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందనే ఎదురుచూస్తున్నామని, సుప్రీంకోర్టు సైతం సానుకూలంగా ఆలోచిస్తుండడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, అందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని పేర్కొన్నారు.

వినాయకచవితికి పందిరి రాట



రాట ముహూర్తంలో పాల్గొన్న సత్తిబాబు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న ప్రారంభంకానున్న వినాయక చవితి ఉత్సవాలకు రాజేంద్రనగర్ రచ్చబండ వినాయక ఆలయం వద్ద రాష్ట్ర శెట్టి బలిజ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో ఆదివారం పందిరి రాట ముహూర్తం చేశారు. ఉత్సవాలను రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుత్తుల జోగారావు, కడిమి శేఖర్, కడిమి ప్రసాద్, బొంత శ్రీహరి, మురగ రాము, బ్రహ్మాజీ, సాగి గంగాధర్ పాల్గొన్నారు.